TELTEL/2015/66279

# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి సంపుటి: 10 సంచిక :174 ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ తేది: మంగళవారం 16-09-2025 పేజీలు:4 వెల: 2.00

## మహారాష్ట్ర గవర్నర్‌గా ఆచార్య దేవవ్రత్ ప్రమాణ స్వీకారం

ముంబై:మహారాష్ట్ర గవర్నర్‌గా గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్ ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం ఉదయం ముంబైలోని రాజ్‌భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రశేఖర్ ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కూడా హాజరయ్యారు.కాగా, ఇటీవలే జరిగిన ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో సీపీ రాధాకృష్ణన్ గెలుపొందిన విషయం తెలిసిందే. దీంతో ఆయన మహారాష్ట్ర గవర్నర్ పదవి నుంచి వైదొలిగారు. ఈనెల 12న భారత 15వ ఉప రాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇక ఆయన రాజీనామాతో ఖాళీ ఏర్పడింది.ఈ నేపథ్యంలో గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్‌కు మహారాష్ట్ర గవర్నర్‌గా రాష్ట్రపతి ద్రౌపది ముర్మ అదనపు బాధ్యతలు అప్పగించారు.ఈ నేపథ్యంలో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు.

## రాష్ట్రంలో ఎన్నికల ముందు హామీల జాతర ఉండేది.. ఇప్పుడు యూరియా కోసం



హైదరాబాద్,తెలంగాణ భవన్ లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం వెంగళరావు నగర్ కార్యకర్తలతో సమావేశమయ్యారు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. కేటీఆర్ తో పాటు సమావేశంలో పీజేఆర్ కుమారుడు విష్ణువర్ధన్ పాల్గొన్నాడు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మాగంటి గోపినాథ్ తయారు చేసిన క్యాడర్ ఇక్కడికి వచ్చింది.. మాగంటి గోపినాథ్ మూడు సార్లు మీ ఆశిస్సులతో గెలిచాడు.. ఓఆర్ఆర్ లోపల ఉన్న ప్రజలు కాంగ్రెస్ నాయకులను ఒక్కరిని నమ్మలేదు.. ఒక్కరిని కూడా బిఆర్ఎస్ మినహా ఎవరిని అసెంబ్లీ కి పంపలేదు..అడ్డమారి గుడ్డి సూటిగా బీజేపీ కి ఒక్క సీటు వచ్చింది.. కాంగ్రెస్, బీజేపీ రెండు జాతీయ పార్టీలను హైదరాబాద్ ప్రజలు నమ్మలేదు.. కేవలం గ్రామాల ప్రజలు కాంగ్రెస్ చూపించిన అరచేతిలో వైకుంఠాన్ని చూసి మోసపోయారు.. కెసిఆర్ చేసిందాని కంటే ఎక్కువ చేస్తామని చెప్పారు కాంగ్రెస్ నాయకులు.. 120 ఏళ్ల చరిత్ర మాది.. మేము తప్పా ఇంకెవ్వరూ చేయారని డైలాగులు కొట్టారు.. ఆ డైలాగులకు కొందరు నమ్మి వాళ్లకు అవకాశం ఇచ్చారు.. కేవలం 1.8% తేడాతో.. నాలుగైదు లక్షల ఓట్ల తేడాతో అధికారంలోకి వచ్చారు..నాలుగు కోట్ల మందిలో నాలుగైదు లక్షల తేడాతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది.. గెలిచినా 23 నెలల్లో కాంగ్రెస్ ఏమి చేసిందో చూస్తే.. మాకంటే మీకే ఎక్కువ తెలుసు.. కోడలు వస్తే 2500 వస్తాయని అత్త అనుకుంటే.. 4 వేల పెన్షన్ వస్తుందని కోడలు అనుకుంది.. తులం బంగారం వస్తుందని అత్తగారు అనుకున్నారు.. కాంగ్రెస్ హామీలతో అందరి మధ్య పంచాయితీ పెట్టాడు.. కాంగ్రెస్ జూటా మాటలు హైదరాబాద్ ప్రజలు నమ్మలేదు.. రాష్ట్రంలో ఎన్నికల ముందు హామీల జాతర ఉండేది..ఇప్పుడు యూరియా కోసం చెప్పుల జాతర కనిపిస్తుంది.. మొత్తం కాంగ్రెస్ వాళ్ళు యూరియా బ్లాక్ మార్కెట్ లో అమ్ముకుంటున్నారు.. మిర్యాలగూడ ఎమ్మెల్యే గన్మెన్ లారీ యూరియా తీసుకెళ్ళాడట.. మళ్ళీ రేపు వెంగళ రావు నగర్ కు తులం బంగారం ఇస్తాం అని వస్తారు.. తులం బంగారం కాదు.. మీ మేడలో ఉన్న పుస్తెల తాడు గుంజుకుపోకపోతే వాళ్లే గొప్పోళ్ళు.. పచ్చి లంగలు కాంగ్రెసోళ్ళు.. తులం బంగారం కాదు.. తులం ఇనుము కూడా ఇవ్వరు.. మీ మెడల పుస్తెల తాడు కూడా జాగ్రత్తగా పెట్టుకోండి..

## అమరుల స్ఫూర్తితో కామ్రేడ్లు ముందుకు వెళ్లాలి..

చిగురుమామిడి, సెప్టెంబర్ 15: ప్రజల సమస్యల కోసం నిరంతరం పోరాటాలు చేసి అసువులు బాసిన అమరుల ఆశయాల కోసం కామ్రేడ్లు ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా మండలంలోని ఇందుర్తి గ్రామంలో అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించి పార్టీ జెండాను ఎగరవేశారు. అనంతరం గాగిరెడ్డిపల్లి, సుందరగిరి, చిగురుమామిడి, రేకొండ, బొమ్మనపల్లి గ్రామాలలో అమరులైన ముసుకు రాజిరెడ్డి, కూన ముత్యాలు, అందే మైసయ్య, గురుకుల జనార్దన్ రెడ్డి, గునుకుల రామ్ రెడ్డి, సింగిరెడ్డి బాల్ రెడ్డి, దొడ్ల మల్లయ్య, నీల మొగిలయ్య, చాడ ప్రభాకర్ రెడ్డి స్తూపాల వద్ద సోమవారం పార్టీ జెండాలను ఎగరవేశారు.అనంతరం వారు మాట్లాడుతూ కమ్యూనిస్టులు పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేశారని, నైజాం నిరంకుశ పరిపాలన విధానాన్ని ఎండగట్టిన ఘనత కామ్రేడ్లకు ఉందన్నారు. తెలంగాణ రైతాంగ పోరాటంలో కమ్యూనిస్టులు చేసిన ఉద్యమాల పోరాటాల పాత్ర మరువలేమన్నారు. ఎందరో కమ్యూనిస్టు నాయకులు ప్రజా సమస్యలపై పోరాటాలు చేసి అసువులు బాసారని అన్నారు. నైజాం పాలననుఎదిరించిన ఘనత కమ్యూనిస్టులదేనన్నారు. వారి ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త కంకణబద్దుడై పార్టీ బలోపితం కోసం కృషి చేయాలన్నారు. పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని కోరారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కమ్యూనిస్టులు తమ సత్తా చాటాల్సిన అవసరం ఉందన్నారు. యువత ప్రజా సమస్యలపై స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అందే స్వామి,



మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, నాయకులు గూడెం లక్ష్మి, బోయిని అశోక్, బూడిద సదాశివ, కోమటిరెడ్డి జైపాల్ రెడ్డి, గోలి బాపురెడ్డి, చాడ శ్రీధర్ రెడ్డి, ముద్రకోల రాజయ్య, తే రాల సత్యనారాయణ, కాంతాల శ్రీనివాస్ రెడ్డి, కూన లెనిన్, అందే చిన్నస్వామి వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో బైక్ ర్యాలీలు..

తెలంగాణసాయుధ పోరాట వారోత్సవాలలో భాగంగా మండలంలోని ఇందుర్తి, గాగిరెడ్డిపల్లి, సుందరగిరి, చిగురుమామిడి, రేకొండ, బొమ్మనపల్లి గ్రామాల మీదుగా కమ్యూనిస్టులు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ జెండాలను పట్టుకొని తరలి వెళ్లారు. రోడ్లన్నీ ఎర్రజెండాలతో ఎరుపుమయమయ్యాయి. యువకులు నృత్యాలు చేశారు. బొమ్మనపల్లి నుండి హుస్నాబాద్ మండలంలోని మాందాపూర్ కు బైక్ ర్యాలీగా బయలుదేరారు.

## కేసీఆర్ కు,మీకు తేడా ఏముంది?..



హైదరాబాద్,ఫీజు రీయంబర్స్ మెంట్ బ్రాండ్ అంబాసిడర్లం తామేనని సంకలు గుద్దుకున్న కాంగ్రెస్ నేతల నిర్వాకంవల్లే కాలేజీలు మూతపడి లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనమయ్యే పరిస్థితి ఏర్పడిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు.మూసీ సుందరీకరణ, ఫోర్త్ సిటీ, మిస్ వరల్డ్ పోటీల పేరుతో వేల కోట్లు ఖర్చు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం 15 లక్షల మందికి పైగా విద్యార్థుల భవిష్యత్తు కనబడటం లేదా? రాష్ట్ర బడ్జెట్ లో నుండి రూ.8 వేల కోట్ల రూపాయలు చెల్లించలేరా? అంటూ ప్రశ్నించారు. నక్సలైట్లను ఎన్ కౌంటర్ చేయడంపైనా కేంద్ర మంత్రి తీవ్ర స్థాయిలో స్పందించారు. "దేశాన్ని రక్షించే ఆర్మీ, చట్టాన్ని కాపాడే పోలీసుల చేతుల్లోనే తుపాకీ ఉండాలి. అట్లా కాకుండా పర్మిషన్ లేకుండా ఎవరి చేతిలో తుపాకీ ఉన్నా సంఘ విద్రోహ శక్తిగానే భావిస్తాం. అందుకే తుపాకీ విడిచి లొంగిపోవాలని కోరుతున్నాం.అట్లా కాకుండా తుపాకులతో మేం కాలుస్తూనే ఉంటాం మీరు మాత్రం చర్చలకు పిలవాల్సిందేనంటే వినే పిరికిపంద ప్రభుత్వం మాది కాదు. నరేంద్రమోదీ ఆధ్వర్యంలో అమిత్ షా నాయకత్వంలో 2026 మార్చి నాటికి మావోయిస్టులను పూర్తిగా నిర్మూలించి తీరుతాం"అని స్పష్టం చేశారు. జాతీయ జెండా ఎగరనీయబోమని, ఎన్నికలే జరపనీయబోమని ఏ దేశపోళ్లు అనాలే మీరే చెప్పాలంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో యూరియా కొరతకు ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమేనన్నారు. సరైన ప్రణాళిక లేకపోవడం, యూరియాను బ్లాక్ మార్కెట్ కు తరలిస్తున్నా చర్యల్లేకపోవడంవల్లే ఈ దుస్థితి తలెత్తిందని చెప్పారు. మంచిర్యాల రైల్వే స్టేషన్ వద్ద ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథరావులతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఏమన్నారంటే ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు ఇవ్వకపోవడంవల్ల రాష్ట్రంలోని 15 నుండి 20 లక్షల మంది విద్యార్థుల జీవితాలు నాశనమయ్యే పరిస్థితి ఏర్పడింది. గత పదేళ్లపాటు కేసీఆర్ ఫీజు రీయంబర్స్ మెంట్ ఇయ్యక తిప్పలు పెట్టారు. ఫీజు రీయంబర్స్ మెంట్ కు బ్రాండ్ అంబాసిడర్ మేమేనని ఇన్నాళ్లు సంకలు గుద్దుకున్న కాంగ్రెసోళ్లు 20 నెలలుగా ఆ బకాయిలియ్యకుండా మోసం చేస్తున్నరు. ? కేసీఆర్ కు, మీకు తేడా ఏముంది? పంజాబ్ పోయి చెక్కులిచ్చి బౌన్స్ చేసి తెలంగాణ పరువును బజారున పడేసే. ఈ కాంగ్రెసోళ్లు టోకెన్ల మీద టోకెన్లు ఇస్తూ మోసం చేస్తున్నరే తప్ప పైసా ఇయ్యడం లేదు. కాంగ్రెస్ నమ్మిన పాపానికి పెనం మీద నుండి పొయ్యిలో పడ్డట్లయింది.ఫీజు రీయంబర్స్ మెంట్ పై ఆధారపడి ఈ రాష్ట్రంలో ఏటా 15 లక్షల మందికిపైగా పేద విద్యార్థులు డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, మెడికల్, ఎంబీఏ, ఎంసీఏ వంటి ఉన్నత కోర్సులను చదువుకుంటున్నరు. నాలుగైదు ఏళ్లుగా ఫీజు రీయంబర్స్ మెంట్ పైసలు చెల్లించకపోతే వాళ్ల పరిస్థితి ఏంది? ఫీజు రీయంబర్స్ మెంట్ ఉందనే ఉద్దేశంతోనే ఉన్నత విద్యా కోర్సుల్లో చేరిన విద్యార్థులు ఇయాళ నడిరోడ్డున పడ్డరు. ఫీజుల కట్టకపోవడంవల్ల కాలేజీలు మెడపట్టి బయటకు నెట్టేస్తున్నయి. ఫోర్త్ సిటీ, మూసీ సుందరీకరణ, మిస్ వరల్డ్ పోటీల పేరుతో వేల కోట్లు ఖర్చు చేస్తున్నరు కదా?పేద విద్యార్థుల కోసం రూ.8 వేల కట్టలేరా? కాలేజీలు బంద్ అయితే విద్యార్థులు ఎటు పోవాలి? ఏం చదువుకోవాలి? వాళ్ల భవిష్యత్తును రోడ్డున పడేస్తారా?ఇదేనా ఇందిరమ్మ రాజ్యమంటే? కాలేజీ యాజమాన్యాలకు ఆనాడే చెప్పిన. కాంగ్రెస్ టోకెన్ల పేరుతో మోసం చేస్తదే తప్ప మీ గోడు పట్టించుకోదని. ఆనాడు చర్చలకు వెళ్లి వాళ్ల మాటలు నమ్మి కాలేజీ యాజమాన్యాలు మోసపోయాయి. కాలేజీ యాజమన్యాల్లో కొందరు కాంగ్రెస్ తొత్తులు ఉన్నందునే వాళ్లకు ఈ దుస్థితి ఏర్పడింది. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి. తక్షణమే ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నా.పేదోడు తెలంగాణలో బతకాలంటే భయమైతుంది. రోగమొస్తే కూడా పట్టించుకునే నాథుడే లేకపాయే ఆరోగ్యశ్రీ పథకం కూడా మాదేనని జబ్బలు చర్చుకున్న కాంగ్రెసోళ్లు ఆరోగ్యశ్రీ బకాయిలు ఇవ్వకపోవడంతో రోగులను ప్రైవేట్ ఆసుపత్రులకు రానీయ్యడం లేదు. ఆరోగ్యశ్రీ పైసలియ్యనిదే ఆసుపత్రుల్లోకి అడుగు పెట్టనిచ్చేదే లేదని ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులోళు తెగేసి చెబుతున్నరు. పోనీ సర్కారు దవాఖానాకైనా పోదామంటే సూది లేకపాయే, మందు బిళ్లలు కూడా లేకపాయే. మరి ఏం చేయాలే. పేదోడికి రోగమొస్తే చావాల్సిందేనా? ఇందుకోసమేనా? కాంగ్రెస్ కు ఓటేసి గెలిపించింది?

## వక్ఫ్ చట్ట సవరణ బిల్లుపై సుప్రీంకోర్టు మధ్యంతర తీర్పు

న్యూఢిల్లీ,వక్ఫ్ చట్ట సవరణ 2025పై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఇప్పుడు తాజాగా ఈ చట్టంలోని కొన్ని కీలక సెక్షన్లపై సుప్రీంకోర్టు మధ్యంతరంగా స్టే విధించింది.వక్ఫ్ చట్ట సవరణ 2025 ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చకు దారితీస్తోంది. మతపరమైన ఆస్తుల పరిరక్షణ పేరుతో చేసిన ఈ సవరణలు ఇప్పుడు రాజ్యాంగబద్ధతపైనే సందేహాలు రేపుతున్నాయి. తాజాగా, ఈ చట్టంలోని కొన్ని కీలక సెక్షన్లపై సుప్రీంకోర్టు మధ్యంతరంగా స్టే విధించింది. పలు రాష్ట్రాల నుంచి దాఖలైన పిటిషన్లలో, సవరణలు మౌలిక హక్కులకు విరుద్ధమని, ప్రజాస్వామ్యానికి భంగం కలిగిస్తున్నాయని ఆరోపణలు వచ్చాయి.

వివాదాస్పద సెక్షన్లపై..

సుప్రీంకోర్టు వక్ఫ్ సవరణ చట్టం 2025లోని కొన్ని నిబంధనల అమలును తాత్కాలికంగా నిలిపివేసింది. చట్టం మొత్తం చెల్లుబాటు అవుతుందని, కానీ కొన్ని వివాదాస్పద సెక్షన్లపై స్టే విధించినట్లు సీజేఐ బీఆర్ గవాయ్ తెలిపారు.

నిలిపివేయబడిన నిబంధనలు:

- సెక్షన్ 3(r): ఆస్తిని వక్ఫ్‌కు దానం చేయాలంటే కనీసం 5 సంవత్సరాలు ఇస్లాం ఆచరించి ఉండాలన్న నిబంధన నిలిపివేయబడింది. ఎందుకంటే, దీన్ని అమలు చేయడానికి సరైన నియమాలు లేకపోతే అధికార దుర్వినియోగం జరిగే అవకాశం ఉంది.
- సెక్షన్ 2(c): నియమిత అధికారి నివేదిక ఇచ్చే వరకు ఆస్తిని వక్ఫ్ ఆస్తిగా పరిగణించరాదన్న నిబంధన నిలిపివేయబడింది. ఎందుకంటే, ఆస్తి హక్కులపై కార్యనిర్వాహక అధికారి తీర్పు ఇవ్వలేరు.
- సెక్షన్ 3C: రెవెన్యూ రికార్డుల్లో మార్పులు చేసే అధికారం కలెక్టర్‌కు ఇవ్వడం అధికార విభజనకు వ్యతిరేకం. అధికారుల తుది నివేదిక వచ్చే వరకు ఆస్తి హక్కులు ప్రభావితం కావు.

ఇతర ముఖ్య నిబంధనలు:

- వక్ఫ్ బోర్డులో నలుగురి కంటే ఎక్కువ మంది ముస్లిం కాని సభ్యులు ఉండకూడదు. రాష్ట్ర స్థాయిలో ముగ్గురి కంటే ఎక్కువ ఉండరాదు.



- వక్ఫ్ బోర్డు ఎక్స్-ఆఫీసియో అధికారి ముస్లిం సమాజానికి చెందినవారై ఉండాలి.

వక్ఫ్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ముస్లిం సమాజానికి చెందినవారై ఉండాలని సుప్రీంకోర్టు సూచించింది. ముస్లిం కాని వ్యక్తిని CEOగా నియమించే సవరణను మాత్రం నిలిపివేయలేదు.తుది తీర్పు వచ్చే వరకు వక్ఫ్ ఆస్తుల హక్కులు, స్వాధీనం ప్రభావితం కావు.

సుప్రీంకోర్టు వ్యాఖ్యలు:

1923 నుంచి వక్ఫ్ చట్టాల చరిత్రను పరిశీలించామని, మొత్తం చట్టాన్ని నిలిపివేయడానికి తగిన ఆధారాలు లేవని సీజేఐ బీఆర్ గవాయ్ తెలిపారు. చట్టం రాజ్యాంగబద్ధమనే అనుమానాన్ని ఎల్లప్పుడూ ముందు ఉంచుతామని, అత్యంత అరుదైన సందర్భాల్లోనే అమలును నిలిపివేస్తామని వెల్లడించారు. మొత్తానికి వక్ఫ్ సవరణ చట్టం 2025 మొత్తం చెల్లుబాటు అవుతుంది. కానీ సెక్షన్ 3(r), 2(c), 3C వంటి వివాదాస్పద నిబంధనలు రాష్ట్ర ప్రభుత్వాలు తగిన నియమాలు రూపొందించే వరకు అమలులో ఉండవు.

## ఖతార్ విషయంలో జాగ్రత్త.. నెతన్యాహుకు ట్రంప్ వార్నింగ్



వాషింగ్టన్: ఖతార్ రాజధాని దోహా లో హమాస్ నేతలే లక్ష్యంగా ఇజ్రాయెల్ వైమానిక దళం గత వారం భీకర దాడులకు పాల్పడిన విషయం తెలిసిందే. ఈ దాడులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా స్పందించారు. ఈ మేరకు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఖతార్ తమకు చాలా ముఖ్యమైన మిత్ర దేశమని చెప్పారు. ఖతార్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని, ఏదైనా నిర్ణయం తీసుకోవాలనుకున్నప్పుడు ఆచితూచి వ్యవహరించాలని ఇజ్రాయెల్‌ను హెచ్చరించారు. 'నెతన్యాహు.. ఖతార్ విషయంలో జాగ్రత్త. అది అమెరికాకు చాలా ముఖ్యమైన మిత్రదేశం. హమాస్‌పై ఎటువంటి చర్యలు తీసుకున్నప్పటికీ ఖతార్ జోలికి మాత్రం వెళ్లొద్దు. ఏదైనా నిర్ణయం తీసుకోవాలనుకున్నప్పుడు ఆచితూచి వ్యవహరించాలి' అని హెచ్చరించారు.గాజాలో కాల్పుల విరమణ కోసం అమెరికా చేసిన ప్రతిపాదనలపై చర్చించేందుకు గత వారం దోహాలో హమాస్ కీలక నేతలు సమావేశమయ్యారు. ఆసమయంలో హమాస్ నేతలపై 'సమ్మిట్ ఆఫ్ ఫైర్' పేరుతో ఇజ్రాయెల్ విరుచుకుపడింది. . ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు కార్యాలయం ఈ దాడికి బాధ్యత వహించింది. హమాస్ అగ్రశ్రేణి ఉగ్రవాద నాయకులపై నేటి చర్య పూర్తిగా స్వతంత్ర ఆపరేషన్ అని.. ఇజ్రాయెల్ ఈ ఆపరేషన్‌ను ప్రారంభించి.. నిర్వహించిందని.. దీనికి ఇజ్రాయెల్ పూర్తి బాధ్యత వహిస్తుందని పీఎం కార్యాలయం పేర్కొంది.ఖతార్ స్టేట్ ప్రసార సంస్థ అల్ జజీరా దాడులను ధ్రువీకరించింది. ఈ క్రమంలోనే తమ వైమానిక దళం హమాస్ నాయకులను లక్ష్యంగా చేసుకుని దాడి చేసిందని ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. హమాస్ ప్రతినిధి ఖలీల్ అల్-హయ్యా ఈ దాడిలో చనిపోయాడని అల్ అరేబియా తెలిపింది. ఇజ్రాయెల్ దాడిని ఖతార్ తీవ్రంగా ఖండించింది. ఇది పిరికిచర్య అని, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమేనని మండిపడింది. ఇజ్రాయెల్ అనాలోచిత చర్యలను సహించబోమని హెచ్చరించింది.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల బరిలో కవిత పార్టీ అభ్యర్థి..?

హైదరాబాద్, సెప్టెంబరు15 తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఈ క్రమంలో ఈ ఎన్నికలకు సంబంధించిన కార్యాచరణను రూపొందిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇందుకోసం కీలక నేతలతో కూడా కవిత సమావేశం అవుతున్నట్లు తెలుస్తోంది. తన ప్లాన్‌లో భాగంగానే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల బరిలో తెలంగాణ జాగృతి పార్టీ నుంచి ఓ అభ్యర్థిని బరిలోకి దింపాలని కవిత యోచిస్తున్నట్లు సమాచారం.

అభ్యర్థి అతనేనా..?

ఈ నేపథ్యంలో కవితతో జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే పి. విష్ణువర్ధన్ రెడ్డి ఇవాళ(సోమవారం) ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. వీరి భేటీలో పలు కీలక అంశాలపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. అరగంటకు పైగా మంతనాలు సాగినట్లు సమాచారం. ఇందులో భాగంగానే ఉప ఎన్నికలో విష్ణువర్ధన్ రెడ్డిని పోటీకి దించే యోచనలో కవిత ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

వేడుకలకు ఆహ్వానం..

కాగా, కవితను కలిసిన అనంతరం విష్ణువర్ధన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి దసరా వేడుకలకు మాత్రమే కవితను ఆహ్వానించానని



క్లారిటీ ఇచ్చారు. ఈ వేడుకలకు హాజరు కావాలని ఆమెకు ఆహ్వాన పత్రికను అందజేశానని విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. అలాగే, ఈ ఏడాది బతుకమ్మ సంబరాల సందర్భంగా కవిత తన పార్టీ పేరును ప్రకటించే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది.

## తెలుగువాళ్లు అగ్రస్థానంలో ఉండాలి : చంద్రబాబు




అమరావతి: సామాజిక న్యాయాన్ని పరిగణిస్తూ సమర్థతకు పెద్దపీట వేస్తున్నామని ఏపి సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. ప్రపంచంలోనే తెలుగు వాళ్లు అగ్రస్థానంలో ఉండాలనేదే తన ఆలోచన అని అన్నారు. ఈ సందర్భంగా సిఎం మీడియాతో మాట్లాడుతూ.. డబుల్ ఇంజిన్ సర్కార్, డబుల్ డిజిట్ గ్రోత్ అని 15 శాతం వృద్ధిరేటు సాధించగలగాలని తెలియజేశారు. తలసరి ఆదాయం పెంచేలా కృషి చేయాలని, ఈ ప్రభుత్వం రాగానే నిర్దిష్టమైన విధానం వికసిత్ భారత్ 2047 తయారు చేసిందని పేర్కొన్నారు.మనం కూడా స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 తయారు చేశామని, ఇంతకు ముందంతా హార్డ్ వర్క్ ఇప్పుడు స్మార్ట్ వర్క్ చేయాలని అధికారులకు సూచించారు. ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు పి4 తీసుకొచ్చామని, అభివృద్ధి చేస్తూనే సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తామని చెప్పారు. ఎకో సిస్టమ్ తయారు చేయాలని, భారత్ ప్రథమ స్థానంలో నిలవాలని కోరారు. నరేంద్ర మోడీ ప్రధాన మంత్రిగా వచ్చాక 11 వ ఆర్థిక వ్యవస్థ నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తయారైందని చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

## సంపాదకీయం

**మంగళవారం 16-09-2025**

# విమోచన అంటే ఉలికిపాటు ఎందుకో?

తెలంగాణ విమోచన అనగానే పాలకులు ఉలిక్కిపడుతున్నారు. ఏదో పేరు పెట్టి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని కూడా జరుపుకోవడానికి జడుస్తున్న నేతలు ఉన్నందుకు మనం సిగ్గుపడాలి. బాజాప్తా ఎందుకు విమోచన జరపలేక పోయారో తగ పాలకులు, నేటి పాలకులు సమాధానం ఇచ్చుకోవాలి. నిజాం నిరంకుశాలను, రజాకార్ల ఆగడాలను ఎదరించడానికి జరిగిన పోరాటం ముమ్మాటికి తిరుగబాటుచరిత్రే అవుతుంది. చైనా,రష్యాల్లో జరిగిన పోరాటలకు ఇది తక్కువేం కాదు. అయినంత మాత్రాన విమోచన దినోత్సవంజరపరాదని అన్నవాళ్లు మూర్ఖులు కాక మరోటి కాదు. దీనిని విస్మరించేలా చేయడం పాలకులకు మంచిది కాదు. ఖాసింరజ్వీ ఘాతుకాలకు అంతులేని చరిత్ర ఉంది. అదంతా చదువుతుంటే రక్తం మరిగిపోతుంది. నిజాం గురించి, ఆ పాలన గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. విముక్త తెలంగాణ జరిగిన సెప్టెంబర్17న విమోచన ఉత్సవాలు జరుపుకోవాలన్న ఆకాంక్షలను గత ప్రభుత్వాలతో పాటు, తెలంగాణ ప్రభుత్వం కూడా విస్మరించడం ద్వారా చరిత్రను అపహాస్యం చేస్తూ వస్తున్నారు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత దీనిని ఘనంగా జరపాల్సిన ప్రభుత్వం దానిని దాటవేయడం ద్వారా ప్రజలను అవమానించడం తప్ప మరోటి కాదు. దీనిపై తెలంగాణ ఉద్యమ సమయంలో మాట్లాడిన నేతలు ఇప్పుడు మాట్లాడకపోవడం మరింత అవమానకరం. తెలంగాణలో రజాకార్లు చేసిన ఘాతుకం రక్తచరిత్రకు తార్కాణం. వారి దాష్టీకానికి ప్రజల మాన,ధన, ప్రాణాలు పోయాయి. అన్నింటికి మించి ఆడవాళ్లను నగ్నంగా బతుకమ్మలు ఆడించారు. ఇక అత్యాచార ఘటనలకు అంతేలేదు. భర్తల ముందే మహిళలపై సామూహిక అత్యాచారాలకు తెగబడ్డారు. అడ్డొచ్చిన మహిళల భర్తలను అడ్డంగా తెగనరికారు. విమోచన దినోత్సవం జరపడం అంటే దాష్టీకాలను ఎండగట్టడం మాత్రమే. ఆనాటి అరాచాకాలను గుర్తు చేసుకోవడం. ఆనాటి ఘటనల్లో మరణించిన ప్రజలకు నివాళి అర్పించడం. ఎందరో అమాయక స్త్రీలు తమ మానప్రాణాలు కోల్పోయి బలిదానం అయ్యారు. వారిని స్మరించుకుని వారికి నివాళి అర్పించడం మాత్రమే. నిజాం లొంగిపోయిన రోజు అనడం కంటే ఓ నిరంకుశుడిని పారదోలిన కారణంగా హైదరాబాద్ విమోచన దినం జరపడం అన్నది తప్పులేదు. ప్రపంచ చరిత్రలో పోరాటాలన్నీ నిరంకుశత్వం మీద దాడుల కోసం జరిగినవే. వాటిని స్వాతంత్ర్య దినాలుగానే జరుపుకుంటున్నారు. తెలంగాణ విముక్తం కూడా ఒక స్వాతంత్ర్య దినోత్సవం లాంటిదిదే. క్రూర రాచరిక తరహా పాలన నుంచి విముక్తి జరిగిన రోజుగా గుర్తించాలి. గతంలోకి వెళితే... ఆఖరి నిజాంకాలంలో, క్రూరభూస్వామ్యం పడగలెత్తి గ్రామాలను పీడించుకుని తింటున్న ప్పుడు, ప్రజలు తిరగబడ్డారు. పోరాడారు. భూములు ఆక్రమించుకుని పంచు కున్నారు, మరోవైపు నిజాం ను కీలుబొమ్మ చేసుకున్న రజాకార్లు కమ్యూనిస్టులపైన, కొన్ని చోట్ల కాంగ్రెస్ వారిపై, ప్రభుత్వ వ్యతిరేకత ఎక్కడ ఉంటే అక్కడ దౌర్జన్యాలు చేశారు. భూస్వాముల గడీల్లో ఆశ్రయం పొందుతూ వారి తరఫున దాడులు చేశారు. పెద్ద ఎత్తున రక్తపాతం జరిగింది. బైరాన్‌పల్లి, పరకాల ఇలా ఎన్నోచోట్ల అరాచకాలకు అడ్డూ అదుపులేకుండ ఆపోయింది. కేవలం జలియన్‌వాలా బాగ్ గురించి మాత్రమే చెప్పుకుంటాం. పరకాలలో నరమేథం సాగింది. బైరాన్‌పల్లిలో ఆడవాళ్లను నగ్నంగా బతుకమ్మ లను ఆడించారు. పొలాలపై దాడులు చేశారు. ధాన్యాన్ని తరలించారు. క్రూరంగా హింసించారు. బహుశా భారతదేశ చరిత్రలో ఇంతటి దారుణాలు జరిగినా స్వాతంత్ర్య పోరాటం కారణంగా ఇవన్నీ మరుగున పడిపోయాయి. మరోవైపు నిజాం, భారత, పాకిస్థాన్ దేశాలు రెంటితోనూ తాను కలవబోనని, స్వతంత్రంగా ఉంటానని ప్రకటించాడు. ఓ దశలో పాక్‌లో కలవడానికి కూడా సిద్దం అని ప్రకటించాడు. భారత ప్రభుత్వంతో ఆ విషయమై చర్చలు, వాదాలు సాగుతూ ఉండగానే, మరో వైపు కమ్యూనిస్టుల పోరాటం సాగుతూ ఉన్న దశలోనే, భారత ప్రభుత్వం సైనికచర్య జరిపింది. నిజాం లొంగిపోయాడు. నిజాం లొంగడానికి అంతా సాజావుగా సాగలేదు. ఆనాటి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ సైనిక చర్య తీసుకుని ఉండకపోతే హైదారాబాద్ సంస్థనం చరిత్ర మరోలా ఉండేది. అన్ని సంస్థానాలను విలీనం చేసిన సందర్భంగా ఎలాంటి పేచీ రాకున్నా కాశ్మీర్ విషయంలో మొన్నటి దాకా పంచాయితీ తేలలేదు. 370 రద్దుతో మొన్నటికి మొన్న అది సంపూర్ణంగా భారత్‌లో విలీనం అయ్యింది. తెలంగాణ విషయంలో కూడా నెహ్రూ జోక్యం ఉండివుంటే కాశ్మీర్ లాంటి పరిస్థితి మనకు ఉండేది. అయితే తెలంగాణలో రజాకార్ల పాలనలో జరుగుతన్న అరాచాకాలను అందరూ ఎదరించి ప్రాణాలు కోల్పోయారు. నిరంకుశ రాచరిక తరహా పాలన స్థానంలో ప్రజాప్రాతినిధ్య పాలన కోసం జరిగిన పోరాటం అంతా ఇంతాకాదు. తెలంగాణ అంతర్భాగంగా ఉన్న హైదరాబాద్ రాజ్యంలో జరిగింది జాతీయోద్యమం కాకున్నా అరాచక పాలనను అంతమొందించేందుకు ప్రజలు సాయుధ పోరాటం చేయాల్సి వచ్చింది. గాంధీతో సహా కాంగ్రెస్ వారు ఆనాడు ఇక్కడి ప్రజల గురించి పట్టించు కోలేదు. ఇక కమ్యూనిస్టులు చేసింది భూస్వామ్యా నికి వ్యతిరేకంగా భూమికోసం విముక్తి పోరాటం మాత్రమే. అయితే రజాకార్ల దాష్టీకానికి ప్రజలు సమాయత్తం అయినప్పుడు అంతా కలసి కదిలారు. చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య లాంటి వీరులు చేసిన త్యాగం తక్కువేం కాదు. 1948 సెప్టెంబర్ 13-17 మధ్య జరిగింది భారత ప్రభుత్వం హైదరాబాద్ రాజ్యంపై జరిపిన పోలీసు చర్య కారణంగా హైదరాబాద్ సంస్థానం భారత్‌లో విలీనం అయ్యింది. ఈ చర్యను కాంగ్రెస్ పార్టీ ఆహ్వానించడం తో పాటు, ప్రజలు కూడా సంతోషించి సంబరాలు చేసుకున్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఏడాదికి జరిగిన విముక్తి పోరాటం కావడంతో ప్రజల్లో సహజంగానే ఆనందం వెల్లి విరిసింది. బానిస సంకెళ్లు తెగినందుకు ఆనందించారు. కాంగ్రెస్ నేత భట్టి విక్రమార్క కూడా అసెంబ్లీ వేదికగా దీనిని ఆనాడు ప్రస్తావించిన విషయాన్ని మరచిపోయారు.

# తిరుమలవాసా.. చూడు తెలంగాణ గోస!



తిరుమల కలియుగ దైవం తిరుమల కొండ మీద రద్దీని తగ్గించడానికి అనేక దర్శన మార్గాలను తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అందుబాటులోకి తెచ్చినప్పటికీ భక్తుల రద్దీ మాత్రం తగ్గడం లేదు. సర్వదర్శనం చేసుకోవాలంటే అలిపిరి మెట్ల మార్గం మీదుగా నడిచివెళ్లాల్సి ఉంటుంది. స్లాటెడ్ దర్శనం కావాలంటే తిరుపతిలో నిర్దేశించిన కేంద్రాల వద్ద వేకువ జామున నిల్చుంటే తప్ప లభ్యం కావు. సరే పరపతిని ఉపయోగించి తెలంగాణ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల నుంచి సిఫారసు లేఖలు తీసుకుందామంటే అక్కడ వెయిటింగ్ పిరియడ్ మూడు నెలలు తక్కువ లేదు. దేవుడి దర్శనం కోసం సిఫారసు ఉన్నా మూడు నెలల వరకు దర్శనం లభించడం లేదంటే ఎంత దుర్లభమో ఊహించుకోవచ్చు. ఇవన్నీ ఒక ఎత్తైతే రవాణ సౌకర్యం కూడా మరో సమస్య. దర్శనం టికెట్ లభించినా, ప్రయాణించడానికి రైలు రిజర్వేషన్ దొరకదు, బస్సులో వెళ్దామంటే ప్రయాణానికి అనువుగా ఉండటం లేదని భక్తులు వాపోతున్నారు.

### మూడు నెలలు వెయిటింగ్ లిస్టు

తెలంగాణలో ఎవరైనా సిఫారసు లేఖ తీసుకుని తిరుమలలో సర్వ దర్శనం, బ్రేక్ దర్శనం కోసం వెళ్లాలంటే కనీసం మూడు నెలలు వెయిట్ చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయని తెలుస్తున్నది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల వద్దకు వెళ్లినా ఇదే సమాధానం విన్పిస్తున్నదని భక్తులు చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసులను టీటీడీ స్వీకరిస్తున్నది. వారంలో రెండు రోజులు (సోమ, మంగళవారం) సర్వదర్శనం, మరో రెండు రోజులు (బుధ, గురువారం) బ్రేక్ దర్శనం అవకాశం ఇస్తున్నారు. అయితే ఇక్కడ ఒక మెలిక ఉంది. ప్రతి రోజూ ఒక ప్రజా ప్రతినిధి ఒక సిఫారసు లేఖ మాత్రమే ఇవ్వాలి. రెండో లేఖ ఇచ్చినా అక్కడ చెల్లుబాటు కాదు. ఒక లేఖపై ఆరుగురికి దర్శనం లభిస్తుంది.

### తెలంగాణలో దేవాలయాల అభివృద్ధి లేకపోవడమే కారణమా?

ఒకప్పుడు తెలంగాణ భక్తులకు ఇంతగా వెయిటింగ్ లిస్టు ఉండేది కాదని భక్తులు చెబుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లేఖలు ఇచ్చేవారు కాదని, ఒక వేళ ఇచ్చినా అక్కడ చెల్లుబాటు అయ్యేది కాదని చెబుతున్నారు. ఇంతగా డిమాండ్ పెరగడానికి కారణం తెలంగాణలో దేవాలయాలను అభివృద్ధి చేయకపోవడం, యాదగిరి గుట్ట ఒక్కటే పెద్ద దేవాలయం ఉండటం కూడా మైనస్ అయ్యిందని చెబుతున్నారు. దీంతో ప్రతి ఒక్కరు మంచి జరిగినా, చెడు జరిగినా కలియుగ దైవం దర్శనం కోసం తిరుమలకు బయల్దేరడం కూడా కారణమని చెబుతున్నారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్, హిమాయత్ నగర్ లిబర్టీ శ్రీ వేంకటేశ్వర ఆలయాల్లో పండుగలు, పర్వదినాలు, సెలవు రోజుల్లో రద్దీగా ఉంటున్నాయి. కొందరు మంత్రులు సచివాలయం నుంచి కాకుండా నియోజకవర్గంలోని క్యాంప్ కార్యాలయం నుంచి సిఫారసు లేఖలు ఇస్తున్నారని సమాచారం. ఎక్కువగా తమ నియోజకవర్గం ప్రజలు లేదంటే జిల్లా ఓటర్లకు ప్రాధాన్యం ఇస్తున్నారని చెబుతున్నారు. ఇక ఎవరికీ కూడా అంతగా ప్రాధాన్యం ఇవ్వడం లేదని తెలుస్తున్నది.

### తిరుమలలో ఏపీ ఎమ్మెల్యేల పీఆర్వోలు

తెలంగాణ ప్రజా ప్రతినిధుల పరిస్థితి ఇలా ఉంటే ఏపీలోని మంత్రులు, ఎమ్మెల్యేలు తిరుమలలో ప్రత్యేకంగా పీఆర్వోలను నియమించుకున్నారు. దీంతో నియోజకవర్గం సామాన్య ప్రజలకు సిఫారసు లేఖలు లభ్యం కావడం లేదనే విమర్శలు ఉన్నాయి. ప్రతి రోజూ సిఫారసు లేఖలు ఇచ్చే అధికారం ఉండటంతో పీఆర్వోల ద్వారా బయటి వారికి విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. తిరుమల కొండపై తాము సిఫారసు లేఖతో వచ్చామని ఏపీకి చెందిన సామాన్య భక్తులు ఎవ్వరూ చెప్పడం లేదంటే వ్యాపారం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోందని భక్తులు చెబుతున్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఇవ్వకుండా తిరుమలలో పీఆర్వోల ద్వారా ఇస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. సుపథం అయితే ఒక్క టికెట్ కు రూ.3వేలు, బ్రేక్ కు అయితే రూ.7వేల చొప్పున వసూళ్లు చేస్తున్నారని ప్రజలే ఆరోపిస్తున్నారు. ఏపీలో తెలుగుదేశ ప్రభుత్వంపై సామాన్య భక్తుల్లో వ్యతిరేకత పెరగడానికి ఇదో కారణంగా చెబుతున్నారు.

### సర్వ దర్శనం

ఎలాంటి టిక్కెట్లు లేకుండానే శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవచ్చు. వీరిని క్యూలైన్ల నుంచి కాంపార్ట్‌మెంట్ల ద్వారా పంపిస్తారు. ఈ కంపార్ట్‌మెంట్లు నిండితే నారాయణగిరి గార్డెన్స్ వద్ద ఉన్న తొమ్మిది కంపార్ట్‌మెంట్లలోకి పంపిస్తుంటారు. ఇవి కూడా నిండితే క్యూలైన్లో నిల్చోక తప్పదు. దర్శనానికి కంపార్ట్‌మెంట్లలో ఉన్న భక్తులకు భోజనం, టీ, పాలు అందచేస్తారు. ఎవరైనా అనారోగ్యం పాలయితే వైద్య సౌకర్యాలు లభిస్తాయి.

# మూలాలు మరచి.. విన్యాసాలెందుకు?

హైదరాబాద్,భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావు శుక్రవారంనాడు ఎక్స్‌లో ఒక ట్వీట్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నందుకు ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ సిగ్గుపడాలి అన్నారు ఆ ట్వీట్లో. దేశవ్యాప్తంగా రాహుల్ గాంధీ ఓటర్ల నమోదు, ఎన్నికల నిర్వహణ మొదలైన అంశాలలో జరుగుతున్న అవకతవకల మీద ఓట్ చోరీ అని సాగిస్తున్న ఉద్యమం కంటే కూడా ఎంఎల్ఎల చోరీ దారుణమైన నేరమని కెటి రామారావు అభిప్రాయపడ్డారు. ఇదంతా ట్వీట్‌లోనే, ఈ మధ్యకాలంలో ఒక కెటి రామారావే కాదు చాలామంది రాజకీయ నాయకులు, చాలా రాజకీయ పార్టీలు తాము ప్రజలకు చేరవేయదల్చుకున్న సమాచారాన్ని ఇట్లా ఎక్స్ లోనో, వాట్సాప్ లోనో, ఇంకా ఇతర సామాజిక మాధ్యమాల్లోనో పెట్టి మీడియాను అది రాసుకోండి, ప్రసారం చేసుకోండి అని చెప్తున్నారు. ఇక్కడ ఈ వార్తను రాసే విలేకరులు, ప్రచురించే పత్రికలు, ప్రసారం చేసే ఛానళ్లు ఏవైనా సందేహాలు ఉంటే తీర్చుకునే మార్గం లేదు. వాళ్ళు ఏం చెప్తే అది రాసుకోవాలి అంతే. సామాజిక మాధ్యమాలేవి లేని కాలంలో రాజకీయ నాయకులు తాము ప్రజలకు తెలియజేయదలుచుకున్న విషయాలను విలేకరుల సమావేశాలు నిర్వహించి చెప్పేవారు. అప్పుడు సదరు నాయకుడు చెప్తు న్న దానిలో ఏమైనా సందేహాలు ఉంటే అక్కడే విలేకరులు ప్రశ్నలు అడగడం, దానికా నాయకుడు సమాధానం చెప్పడంతో వార్త సంపూర్ణంగా ఉండేది. ఇప్పుడు ఆ అవకాశం పోయింది. ఎప్పుడో అమావాస్యకో, పున్నానికో నాయకులు పత్రిక గోష్టి నిర్వహించినా విలేకరులు సందేహాలు తీర్చుకోవడానికి ప్రశ్నలు వేసే అవకాశం ఇవ్వడం చాలా అరుదు. మేము చెప్పింది రాసుకోండి అన్న ధోరణి ఈ పార్టీ, ఆ పార్టీ అనే తేడా లేకుండా అందరూ పాటిస్తున్నదే. రాజకీయ పార్టీలు ఇప్పుడు వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి అందులో తాము మాత్రమే సమాచారం పంపే విధంగా అవతలి వాళ్ళు ఎవరు చర్చలోకి గాని, సంభాషణలోకి గాని దిగకుండా ఉండేట్టు ఏర్పాటు చేసుకుంటున్నారు. దానితో వాట్సాప్‌లో వచ్చిన సమాచారాన్ని యథాతథంగా నాయకులు రాసే తప్పులతో సహా తూచా తప్పకుండా ప్రచురించేస్తున్నాయి కొన్ని పత్రికలూ. దీనికి కట్ అండ్ పేస్ట్ జర్నలిజం అని పేరు కూడా బాగా ప్రచారంలోకి వచ్చింది. సరే ఇప్పుడు మళ్లీ కెటిఆర్ తాజా ట్వీట్ లోకి వెళితే ఆయన ఈ సమాచారం ఎక్స్ లో కాకుండా నేరుగా పత్రికా గోష్టి నిర్వహించి ఉంటే విలేకరులు ఎటువంటి ప్రశ్నలు అడిగేవారు అన్న విషయం గురించి చర్చించుకుందాం. దానికన్నా ముందు పార్టీ ఫిరాయింపులను కెటి రామారావు అంత దారుణమైన నేరంగా ఎందుకు పరిగణించారు? అన్న విషయం కొంచెం వివరంగా మాట్లాడుకోవాలి. బహుశా ఆయన 2001 నుండి 2014 వరకు అప్పటి ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంత రాజకీయ పరిణామాలు గుర్తొచ్చి, 2014 తర్వాత 2023 వరకు జరిగిన విషయాలు గుర్తుకు రాక మాట్లాడి ఉంటారు. ఒక పార్టీకి రాజీనామా చేస్తున్నప్పుడు ఆ పార్టీ ద్వారా సంక్రమించిన పదవికి రాజీనామా చేయాలనే మంచి ఆలోచన తెలంగాణ ఉద్యమ మలి దశలో 2001లో కెటిఆర్ తండ్రిగారు మాజీ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు తోటే మొదలైంది. 2001లో ఆయన తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పాటు చేయడం కోసం ట్యాంక్ బండ్ వద్ద జలవిహార్‌లో నిర్వహించిన సభలో ఒకటి కాదు రెండు కాదు ఏకంగా మూడిటికి రాజీనామా చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం ద్వారా సంక్రమించిన ఉపసభాపతి పదవికి, తెలుగుదేశం పార్టీ ద్వారా సంక్రమించిన శాసన సభ్యత్వానికి, అట్లాగే ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి కూడా ఆయన రాజీనామాలు చేశారు. ఆ తర్వాత కూడా ఒక లక్ష్యం కోసం రాజీనామాలు చేయడంలో కెసిఆర్‌ని ఆదర్శంగా తీసుకోవచ్చు. 2006లో, 2008లో రెండుసార్లు ఆయన కరీంనగర్‌నుంచి గెలిచిన లోకసభ సభ్యత్వానికి రాజీనామా చేసి ఉపఎన్నికల్లో తిరిగి గెలిచి వచ్చారు. అంతేకాదు 2011లో తన పార్టీకి చెందిన 11 మంది శాసనసభ్యుల చేత రాజీనామాలు చేయించి ఉపఎన్నిక తప్పనిసరి చేయించారు. అప్పట్లో ఒక బిజెపి సభ్యుడు నిజామాబాద్ నుంచి ఎండల లక్ష్మీనారాయణ కూడా రాజీనామా చేసి ఉపఎన్నికలు గెలిచినట్టున్నారు. అప్పుడు ఆయన ఓడించింది సాక్షాత్తు పిసిసి అధ్యక్షుడిగా ఉన్న సీనియర్ కాంగ్రెస్ నాయకుడు డి శ్రీనివాస్‌ను. ఇదంతా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రజల్లో నెలకొన్న దృఢ సంకల్పం కారణంగా సాధ్యమైంది అనడంలో సందేహం లేదు. బహుశా ఇవే గుర్తుండి కెటి రామారావు



రాహుల్ గాంధీని సిగ్గుపడండి అంటున్నట్టు ఉన్నారు. అంతేకాదు ఆయన ఇంకో మాట కూడా ఎక్కడో అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్తున్న అబద్ధాలను మీడియా యథాతథంగా ప్రచురిస్తున్నది అని. మరి ఈ శనివారంనాటి పత్రికలన్నీ కెటి రామారావు గారి ట్వీట్‌లో అర్థ సత్యాలన్నిటిని కూడా యథాతథంగానే ప్రచురించాయి వాటి మాటేమిటి.ఒక పార్టీ వ్యవహారం నచ్చకపోతే నో లేదా మరో పార్టీ బాగా పని చేస్తుందనిపిస్తేనో పార్టీ మారడానికి ఎవరికీ అభ్యంతరం ఉండాల్సిన అవసరం లేదు. అయితే ఆ పార్టీ ద్వారా సంక్రమించే పదవులకు రాజీనామా చేసి ఇంకో పార్టీ లోకి మారితే పేచీ ఉండదు. తాజా ఉదాహరణ, కెటి రామారావు సొంత సోదరి కవితను తాను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న పార్టీ నుండి సస్పెండ్ చేస్తే ఆమె ఆ పార్టీ ద్వారా సంక్రమించిన శాసనమండలి సభ్యత్వానికి స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా పంపించారు. పార్టీకి కూడా రాజీనామా చేశారు. శాసనమండలి అధ్యక్షులు ఇంకా ఆమె రాజీనామా మీద ఏ నిర్ణయం తీసుకున్నట్టు లేరు. ఈ సందర్భంగా మరొకరిని గురించి కూడా మాట్లాడుకోవాలి. భారతీయ జనతా పార్టీ శాసనసభ్యుడు రాజాసింగ్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తూ ఆ విషయాన్ని స్పీకర్‌కు తెలిపి నిర్ణయం తీసుకోమనండి అని బాధ్యత పార్టీ మీదకు తోసి కూర్చున్నారు. పార్టీ ఆయన రాజీనామాను ఆమోదించింది, కానీ శాసనసభ్యత్వం తొలగించమని స్పీకర్‌కు ఇంకా అడిగినట్లు లేదు. ఈలోగా ఆయనే నేను రాజీనామా చేయను ఏం చేసుకుంటారో చేసుకోండి అన్నారు.ఇటువంటి ఉదాహరణలు మనకు చాలా కనిపిస్తాయి. ఇక కెటి రామారావు గుర్తు పెట్టుకున్న కాలపు విషయాలు చెప్పుకున్నాం కాబట్టి ఆయన మర్చిపోయిన విషయాలను ఒకసారి గుర్తుచేయాలి. ఇది గుర్తు చేస్తుంటే ఆయన మేము అంతా చట్టప్రకారమే చేశాం, పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం చెప్పిన విధంగానే చేసాం అని వాదించవచ్చు. ఆ వాదన సాంకేతికంగా నిలబడుతుందేమో కానీ నైతికంగా ఎటువంటి బలాన్ని ఇవ్వదు. సుదీర్ఘ పోరాటం అనంతరం రాష్ట్రాన్ని సాధించుకొని తెలంగాణ రాష్ట్ర సమితి 2014లో పరిపాలన చేపట్టిన నాటి నుండి 2023 వరకు ఇతర పార్టీల నుండి గెలిచిన 38 మంది శాసనసభ్యులు, 18మంది శాసనమండలి సభ్యులు అప్పటి తెలంగాణ రాష్ట్ర సమితికి తర్వాత పేరు మార్చుకున్న భారత రాష్ట్ర సమితికి ఫిరాయించారు.వీరిలో కొందరు మంత్రుల య్యారు, మరికొన్ని ముఖ్య పదవులు కూడా అధిష్టించారు. ఆ తొమ్మిదేళ్ల పైచిలుకు కాలం ఎన్ని ఫిర్యాదులు చేసినా స్పీకర్ గాని, మండలి చైర్మన్ గాని ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇంత పెద్ద ఎత్తున ఫిరాయింపులు జరిగినా కిమ్మనకుండా ఊరుకున్న సభాపతులు 2019లో మాత్రం ఆ పార్టీనుండి కాంగ్రెస్‌కు ఫిరాయించిన ముగ్గురు శాసనమండలి సభ్యులపైన అనర్హత వేటు వేసారు. ఇదే రాహుల్ గాంధీ తండ్రి రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు 1985లో 52వ రాజ్యాంగ సవరణ ద్వారా తెచ్చిన పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం. రాజకీయ నాయకుల జవాబుదారీతనాన్ని పెంచడానికి, ప్రభుత్వాల సుస్థిరతను కాపాడటానికి ఉద్దేశించింది.ప్రభుత్వాల సుస్థిరత్వం కాపాడుకోవడం అంటే 2014లో టిఆర్ఎస్ చేసిన పద్ధతిలో కాదు, ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలను ఫిరాయింపుల ద్వారా కూల్చే అవకాశం లేకుండా వాటికి భద్రత కల్పించడం అని అర్థం. గత పది పదకొండేళ్ల కాలంలో కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ వివిధ రాష్ట్రాల్లో ఏం చేసిందో చూసాం. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ఆ ప్రభుత్వాలను కాపాడలేకపో యింది. బహుశా బిజెపి నుంచి ఈ ప్రమాదం తమకు కూడా ఉంటుందేమో అన్న అనుమానంతోనే కెసిఆర్ 2014లో

# కిందిరాష్ట్రాలకే మిగులు జలాల హక్కు

గుంటూరు, మిగులు జలాలలను కింది రాష్ట్రాలు ఉపయోగించుకునే హక్కు ఉందని విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు అన్నారు. గోదావరి మిగులు జలాలను ఉపయోగించుకునే హక్కు ముమ్మాటికీ ఏపికి ఉందన్నారు. ఉమ్మడి ఏపీలో కోస్తాంధ్ర నిర్లక్ష్యానికి గురైందని ఆయన అన్నారు. గుంటూరు బాలానంద కేంద్రంలో ఆలోచనపరుల వేదిక ఆధ్వర్యంలో 'నదీ జలాల హక్కుల పరిరక్షణ, నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణం'పై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఉమ్మడి ఏపీలో హైదరాబాద్ కేంద్రీకృతంగా అభివృద్ధి కోసం నిధులు ఖర్చు చేశారన్నారు. గత 40 ఏళ్లలో ఒక్క భారీ సాగునీటి ప్రాజెక్టు కూడా కోస్తాంధ్రకు రాలేదని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం దశాబ్దాలుగా జరుగుతూనే ఉందని పేర్కొన్నారు. ప్రాజెక్టు డిజైన్లు, నిర్మాణం అంతా రైతుల అవసరాల కోసమే జరగాలని చెప్పారు. మిగులు జలాలు వాడుకునే హక్కు చివరి రాష్ట్రం ఏపీకి ఉంది. ఒక బేసిన్‌నుంచి మరో బేసిన్‌కు నీరు తరలించుకోవచ్చు.ఈ విషయాలు బచావత్ ట్రైబ్యునల్ గతంలో స్పష్టం చేసింది. కానీ తెలంగాణ అనవసర రాద్ధాంతం చేసి మిగులు జలాలపై అసత్య ప్రచారం చేస్తోంది. దీన్ని సాకుగా చూపి తెలంగాణ అనుమతులు లేని ప్రాజెక్టులు నిర్మిస్తోందని ఏబీ వెంకటేశ్వరరావు అన్నారు. కింద సముద్రంలోకి పోతున్న జలాలపై పేచీ పెట్టడం సరికాదన్నారు. బనకచర్ల పేరుతో ఇటీవల చంద్రబాబునాయుడు కొత్త ప్రతిపాదన తేగా తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో ఇప్పుడు దీనిని బలంగా ముందుకు తీసుకుని వెళ్లే క్రమంలో ఈ ప్రతిపాదనలపై వివిధ వేదికల ద్వారా ప్రచారం చేయిస్తున్నట్లు అర్థం అవుతోంది.

# భారత్,చైనాలపై టారిఫ్‌ల విధించండి

వాషింగ్టన్,రష్యా నుంచి చమురును కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలపై భారీగా టారిఫ్‌లను విధించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రతిపాదనకు ఐరోపా సమాఖ్యతో పాటు–, జి 7 దేశాలు అంగీకరించినట్లు– తెలుస్తుంది. ఉక్రెయిన్‌లో శాంతి పునరుద్ధరణ చేయాలని, అందుకోసం రష్యాపై ఒత్తిడి తేవడమే సరైన మార్గం అని అందులో భాగంగా రష్యా చమురును కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలపై భారీ టారిఫ్‌లు విధించాలని అమెరికా ప్రతిపాదించింది. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్‌లో జి 7 దేశాలు సమావేశమయ్యాయి. ఈ భేటీలో సుంకాల విధింపుపై చర్చ సాగింది. ఈ సందర్భంగా అమెరికా వాణిజ్య ప్రతినిధి జామిసన్ గ్రీర్ మాట్లాడుతూ ... ఇప్పటికే భారత దిగుమతులపై అమెరికా భారీ సుంకాలు విధించిన విషయాన్ని ప్రస్తావించారు. ఈ క్లిష్ట సమయంలో నిర్ణయాత్మక చర్య తీసుకోవడానికి జీ 7 దేశాలు ముందుకురావాలని కోరారు. అందుకు జి 7 దేశాలు స్పందిస్తూ ... యుద్ధం ముగింపునకు కట్టు–బడి ఉన్నామని ప్రకటించాయి. రష్యాపై ఒత్తిడి తేవడానికి ఇంతకుముందు ఐరోపా సమాఖ్య (ఈయూ) దేశాల ముందు కూడా ట్రంప్ ఇలాంటి ప్రతిపాదనలే చేశారు. అయితే, ఈ విషయంలో ఈయూ దేశాల్లో భిన్నాభిప్రాయలు వ్యక్తమయ్యాయి. దీంతో అది సాధ్యపడలేదు. ఇవే ప్రతిపాదనలను ఆయన మళ్లీ జి 7 దేశాల ముందుపెట్టడం గమనార్హం. ఇప్పుడు కూడా టారిఫ్‌ల విధింపుపై ఐరోపా సమాఖ్య దేశాల నుంచి భిన్నాభిప్రాయలు వ్యక్తమయ్యాయి. ఫలితంగా అది ఇంకా సాధ్యపడలేదు.ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పేందుకు రష్యా (షశ)పై ఒత్తిడి తేవడమే సరైన మార్గమని అమెరికా భావిస్తోంది. అందులో భాగంగా ఆ దేశం నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలను లక్షియంగా చేసుకోవాలని చూస్తోంది. ఈక్రమంలో ఈయూ, జీ7 దేశాలు భారత్, చైనా లపై టారిఫ్‌లు విధించాలని ట్రంప్ పాలకవర్గం ప్రతిపాదనలు చేసింది. ఇందుకు జీ7 సభ్య దేశాలు కూడా సానుకూలంగా స్పందించినట్లు– తెలుస్తోంది. ఇప్పటికే.. భారత దిగుమతులపై అమెరికా భారీ సుంకాలు విధించిన విషయాన్ని అక్కడ ప్రస్తావించారు. ఈసందర్భంగా యుద్ధం ముగింపునకు కట్టుబడి ఉన్నామంటూ జీ7 సభ్యదేశాలు అమెరికాకు హామీ ఇచ్చాయి. దీంతో భారత్, చైనాలపై సుంకాల విధింపునకు ఆయా దేశాలు కూడా సిద్ధమయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. కాగా.. రష్యాపై ఒత్తిడి తెచ్చేందుకు ఇంతకుముందు ఐరోపా సమాఖ్య దేశాల ముందు కూడా ట్రంప్ ఇలాంటి ప్రతిపాదనలే చేశారు. అయితే, ఈవిషయంలో ఈయూ దేశాల్లో భిన్నాభిప్రాయలు వ్యక్తమయ్యాయి. దీంతో అది సాధ్యపడలేదు. ఇవే ప్రతిపాదనలను ఆయన మళ్లీ జీ7 దేశాల ముందుపెట్టడం గమనార్హం.

# మూడు రాజధానుల పేరుతో జగన్ నాటకాలు

విశాఖపట్నం, గత జగన్ ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో డ్రామాలు ఆడిందని,దీనిని ప్రజలు అప్పుడే ఎలా మరచిపోతారని బీజేపీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి వ్యవహరించారని ధ్వజమెత్తారు. వైసీపీ ప్రభుత్వం మైనార్టీల నిధులను దారి మళ్లించిందని ఆరోపించారు. శనివారం విశాఖపట్నంలో పీవీఎన్ మాధవ్ పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో మాధవ్ మాట్లాడారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించడంతో పురోభివృద్ధి చెందుతోందని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌పై వామపక్ష పార్టీల దుష్ప్రచారాన్ని నమ్మొద్దని అన్నారు. విశ్వాఖ ప్లాంట్‌కు ఎలాంటి ఢోకా లేదన్నారు. అమ్మడం అన్న పరిస్థితి లేకుండా ఆర్థిక సాయంతో కేంద్రం ఆదుకుందని అన్నారు. పోలవరం ప్రాజెక్ట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎన్డీఏ సారథ్యంలో పోలవరం ప్రాజెక్టు పూర్తవుతుంది. అమరావతి రాజధాని నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ప్రైవేటీకరణను ఒక భూతంలా చూపించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రైవేటీకరణ అనేది అన్ని దేశాల్లోనూ జరుగుతోంది. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని మొదట కోరింది బీజేపీనే. విశాఖ ఉక్కు పరిశ్రమలో ఏదో జరిగిపోతోందని కొంతమంది అపోహలు సృష్టిస్తున్నారు. స్టీల్ ప్లాంట్ విషయంలో జరుగుతున్న మంచిని ఎందుకు బయటకు చెప్పడం లేదని పీవీఎన్ మాధవ్ ప్రశ్నల వర్షం కురిపించారు. విశాఖలో సారథ్యం భారీ బహిరంగ సభ నిర్వహించనున్నామని... ఈ సభకు బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. విశాఖలోని రైల్వే మైదాన వేదికలో ఈ సభ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు పీవీఎన్ మాధవ్. సారథ్యం యాత్ర బహిరంగ సభలో బీజేపీలోని ప్రతి కార్యకర్తను భాగస్వామ్యం చేస్తున్నామని వివరించారు. కడప నుంచి సారథ్యం యాత్ర ప్రారంభించామని గుర్తుచేశారు. సారథ్యం యాత్రకు రాష్ట్ర వ్యాప్తంగా విశేష స్పందన వచ్చిందని చెప్పుకొచ్చారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీని స్ఫూర్తిగా తీసుకుని బీజేపీలోని ప్రతి కార్యకర్త పని చేయాలనే విధంగా సారథ్యం యాత్ర చేపట్టామని వెల్లడించారు. సారథ్యం యాత్రలో వైతాలికులను గుర్తించి వారిని స్మరించుకున్నామని తెలిపారు.

# కార్పొరేట్ దోపిడీ కేంద్రాలుగా పట్టణాలు

విజయవాడ, బడా కంపెనీలు పట్టణాలను తమ దోపిడీకి కేంద్రాలుగా మార్చారని సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. కార్పొరేట్, బహుళ జాతి కంపెనీలు ప్రతి నివాసాన్ని తమ దోపిడీకి అడ్డాలుగా మారుస్తున్నారు. వివిధ రూపాలలో ప్రజలను పీల్చి పిప్పి చేస్తున్నారు. అదనపు లాభాల కోసం బడా సంస్థలు.. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాన్ని సాధనంగా మార్చుకున్నారు. సామాన్యులకు మాత్రం గృహ వసతినే గగనంగా మార్చారు. గతంలో ప్రభుత్వ రంగంలో పట్టణాల్లో మౌలిక సదుపాయాలను ప్రభుత్వాలు కల్పించగా నేడున్న బిజెపి కేంద్రం నేడు వాటిని వ్యాపార సరుకులుగా మార్చింది. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) ఆంధ్రప్రదేశ్ కమిటీ- ఆధ్వర్యంలో రెడ్డోజులు పాటు పట్టణ ప్రాంత రాష్ట్ర కార్యకర్తల సమావేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై .వెంకటేశ్వరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశాన్ని బీవీ రాఘవులు ప్రారంభించగా, వి శ్రీనివాసరావు ముగించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబురావు కూడా ప్రసంగించారు. 22 జిల్లాల నుండి 55 నగరాలు, పట్టణాల చెందిన నేతలు, కార్యకర్తలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో బివి రాఘవులు ప్రసంగిస్తూ...పట్టణాలలో మురికివాడలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. ఒకవైపు బడా కంపెనీలు బలిసిపోతుండగా పేదలు చితికి పోతున్నారు. అసమానతలు పెరిగిపోతున్నాయి. బిజెపి, ఆర్ఎస్ఎస్ తదితర మతోన్మాద సంస్థలు విద్వేషాలను రెచ్చగొట్టడానికి పట్టణాలను కేంద్రాలుగా వినియోగించుకుంటున్నాయి. దేవాలయాలు, ఆధ్యాత్మిక కేంద్రాలను ఆసరాగా చేసుకుని ఉన్మాద విష బీజాలు నాటుతున్నారు. సామరస్యంతో జరుపుకునే పండుగలు, ఉత్సవాలలోను మత ఉద్రిక్తతలను రెచ్చగొడుతున్నారు. ఈ స్థితిలో పట్టణాలలో ప్రజా సమస్యలపై ఉద్యమాలను ఉధృతం చేయాలి. మతోన్మాద శక్తులను ఎదుర్కోవాలి. కార్పొరేట్ కంపెనీల దోపిడీకి అడ్డుకట్ట వేయాలి. కేంద్ర మోడీ ప్రభుత్వ విధానాలను తిప్పి కొట్టాలి. మత సామరస్యాన్ని పెంపొందించాలి. ప్రజలు ఐక్యం చేయాలని అన్నారు. రాష్ట్ర కార్యదర్శి వి .శ్రీనివాసరావు ప్రసంగిస్తూ..... 'నేపాల్ లో పాలకులపై పెరిగిన అసంతృప్తి యువతలో ఒక్కసారిగా పెల్లుబికింది. మనదేశంలో నిరంకుశ పాలన సాగిస్తున్న మోడీ ప్రభుత్వానికి ఇది హెచ్చరిక కావాలి. యువత, ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ఉద్యమాలు తప్పవని గమనించాలి. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పట్టణాలను, రాజధాని నిర్మాణాన్ని కార్పొరేట్ ప్రయోజనాల కోసం కాకుండా ప్రజాప్రయోజనాల దృష్టితో అభివృద్ధి చేయాలి. పన్నుల పెంపుపై కాకుండా సౌకర్యాల కల్పనపై దృష్టి పెట్టాలి. పట్టణాల్లో ప్రజారోగ్యం క్షీణిస్తున్నది. పాలకుల విధానాలతో పట్టణ ప్రజల జీవితాలను దెబ్బతీస్తున్నాయి. రాబోయే కాలంలో పట్టణ ప్రజల సమస్యలపై సిపిఎం ప్రత్యేకమైన ఉద్యమాలు సాగిస్తుంది. కేంద్రానికి లొంగిపోతున్న టిడిపి, జనసేన ప్రతిపక్షంగా ఉన్న వైసిపి రాష్ట్ర ప్రజలకు ద్రోహం చేస్తున్నాయి. కేంద్ర మోడీ ప్రభుత్వ విధానాలపై జరిగే పోరాటంలో పట్టణ ప్రజలు ముఖ్య పాత్ర వహించాలి. రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణ-కై- జరిగే ఉద్యమంలో చురుకుగా పాల్గొనాలి. మతోన్మాద, విద్వేష శక్తుల ఎడల అప్రమత్తతతో ఉండి తిప్పి కొట్టాలని పేర్కొన్నారు. సమావేశంలో పట్టణ ప్రజలు ఎదుర్కొంటు-న్న పలు సమస్యలపై చర్చించి, భవిష్యత్తులో పట్టణ ప్రజల సమస్యలపై ఆందోళన, పోరాట కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించినట్లు- తెలిపారు.

# వారసత్వ నాయకులే..

న్యూఢిల్లీ,"అందరివి నలుపు మరకలే. ప్రతి ఒక్కడూ ఆ తానులో ముక్కలే" వెనకటికి ఓ సినిమాలో బహుళ ప్రాచుర్యం పొందిన డైలాగ్ అది. అది నేటి రాజకీయాలకు ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో కమలం పార్టీలో చోటు చేసుకున్న మార్పులకు అచ్చు గుద్దినట్టు సరిపోతుంది. ఉదయం లేస్తే కమలం పార్టీ నాయకులు ఇతర పార్టీ నాయకులను తిడుతుంటారు. వారసత్వ రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని.. కుటుంబ సభ్యులకే పదవులు ఇస్తున్నారని మండిపడుతుంటారు. ఇన్నాళ్ళ వరకు బిజెపి ని ఈ విషయంలో కార్నర్ చేసే అవకాశం మిగతా పార్టీలకు లభించలేదు. అయితే ఇప్పుడు బీజేపీ నే అవకాశాన్ని మిగతా పార్టీలకు దర్జాగా ఇచ్చేసింది.తెలంగాణలో అధికారంలోకి రావాలని.. కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టాలని బలమైన నిర్ణయంతో ఉంది బిజెపి. ఇప్పటికే గులాబీ పార్టీని మట్టి కరిపించామని.. త్వరలో కాంగ్రెస్ పార్టీని కూడా గద్దె దింపుతామని బిజెపి నాయకులు బలమైన నమ్మకంతో ఉన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ రావాలని బలంగా కోరుకుంటున్నారు. వారి కోరికలు నెరవేరుతాయా.. వారు ఇచ్చిన మాటలు నిలబెట్టుకుంటారా.. అనే విషయాలను పక్కన పెడితే తెలంగాణ బిజెపిలో ఇటీవల కొంతమందికి పదవులు ఇచ్చారు. అవి పార్టీకి సంబంధించిన పదవులు. అయితే ఆ పదవులు పొందిన వారిలో కొంతమంది పేర్లను పరిశీలిస్తే ఆశ్చర్యం అనిపించింది. అద్భుతం కూడా అనిపించింది. వారసత్వ రాజకీయాలకు బిజెపి దూరమని. బిజెపి అటువంటి వాటిని ప్రోత్సహించదని పదేపదే కమల నేతలు చెబుతుంటారు. కానీ వాస్తవానికి కమలం పార్టీ కూడా మిగతా వాటి మాదిరిగానేనని.. పైగా వారసత్వాన్ని పెంపొందించే విషయంలో బిజెపి పీహెచ్డీ చేసిందని తాజా పరిణామాలు రుజువు చేస్తున్నాయి. పార్టీకి సంబంధించిన పదవుల విషయంలో మీడియాకు ఓ జాబితా అందింది. అందులో మాజీ మంత్రి దేవేందర్ గౌడ్ కొడుకు తుళ్ల వీరేంద్ర గౌడ్ కు పార్టీ స్టేట్ జనరల్ సెక్రెటరీ పదవి ఇచ్చారు. మాజీమంత్రి పోతుగంటి రాములు కొడుకు భరత్ ప్రసాద్ కు కూడా స్టేట్ సెక్రటరీ పదవి ఇచ్చారు. పోతుగంటి రాములు గతంలో నాగర్ కర్నూల్ నియోజకవర్గానికి పార్లమెంట్ సభ్యుడిగా ఎ ని చేశాడు.మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె బండారు విజయలక్ష్మి కి సెక్రెటరీగా ప్రమోషన్ ఇచ్చారు.

# భారత్‌ను టార్గెట్ చేసిన అమెరికా..

వాషింగ్టన్:ఉక్రెయిన్‌లో శాంతిని నెలకొల్పేందుకు రష్యాపై ఒత్తిడి తెచ్చేందుకు భారత్ ను టార్గెట్ చేయడమే సరైన మార్గమని అగ్రరాజ్యం అమెరికా భావిస్తోంది.అందులో భాగంగానే మాస్కో నుంచి చమురు కొనుగోలు చేస్తున్న ఇండియా, చైనాలను లక్ష్యంగా చేసుకుంది. ఈ క్రమంలో ఈయూ, జీ7 దేశాలు భారత్, చైనాలపై భారీగా టారిఫ్‌లు విధించాలని ట్రంప్ పాలకవర్గం ప్రతిపాదనలను పంపించింది. ఈ సుంకాల విధించడానికి తాజాగా జీ7 దేశాలు కూడా ఒప్పుకున్నట్లు సమాచారం.కాగా, జీ7 దేశాల ఆర్థిక మంత్రులు శు క్రవారం ( సెప్టెంబర్ 12న) నాడు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారి మధ్య సుంకాల విధింపుపై చర్చ కొనసాగినట్లు టాక్. ఈ సమావేశానికి సంబంధించిన విషయాలను యూఎస్ వాణిజ్య ప్రతినిధి జామిసన్ గ్రీర్ ఓ ప్రకటనలో తెలియజేశారు. రష్యా- ఉక్రెయిన్ యుద్ధం ముగించడానికి నిజంగా కట్టుబడి ఉంటే.. మాస్కోపై ఒత్తిడి తెచ్చేందుకు ఈయూ ముందుకు రావాలని అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ పిలుపునిచ్చారు. అందుకు ఆ దేశం నుంచి చమురు కొనుగోలు చేస్తున్న రెండు పొరుగు దేశాల (భారత్, చైనా)పై సుంకాలు విధించాలని డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రతిపాదనల గురించి చెప్పుకొచ్చారు. అయితే, ఇప్పటికే.. భారత దిగుమతులపై యూఎస్ 50 శాతం సుంకాలు విధించింది.

# జీఎస్టీ 2.0తో పేదలపై మరింత భారం!




న్యూఢిల్లీ,ప్రస్తుతమున్న జీఎస్టీని సవరించి జీఎస్టీ 2.0 తీసుకువస్తున్నామని, దీని ద్వారా ప్రజలపై భారం తగ్గించామని, ఇది ప్రజలకు దీపావళి బొనంజాయే అని కేంద్రం గొప్పగా చెబుతున్నా, వాస్తవ పరిస్థితులు దానికి పూర్తి విరుద్ధంగా ఉన్నాయి. ఈ నెల 22 నుంచి అమలులోకి రానున్న వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) తగ్గింపు భారత వినియోగదారులకు ఎంతో ఉపశమనం కలిగిస్తుందని జీఎస్టీ కౌన్సిల్ ప్రకటించినప్పటికీ ప్రజల పరిస్థితి అలా కనిపించడం లేదు. ఈ ఏడాది ప్రారంభంలోనే ఆహార పదార్థాల కొనుగోలు మినహా ఇతర ఖర్చులకు డబ్బులు వెచ్చించేందుకు చాలా మంది వినియోగదారులు తగినంత సొమ్మును కూడబెట్టలేకపోయారని ఒక నివేదిక హెచ్చరించింది. ఆహార పరిశ్రమపై దృష్టి సారించిన పీడబ్ల్యూసీ ఇండియా ఇందుకు సంబంధించిన వాయిస్ ఆఫ్ కన్స్యూమర్ 2025 నివేదికను ఈ నెల 11న విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం ప్రస్తుతం అమలవుతున్న జీఎస్టీని 32 శాతం మంది తాము ఆర్థికంగా తట్టుకుంటున్నామని చెప్పగా, మరో 7 శాతం మంది తాము ఆర్థికంగా అభద్రతతో ఉన్నామని చెప్పారు.

బియ్యం, కూరగాయల కొనుగోలుకే 40 శాతం పరిమితం

జీఎస్టీ 2.0 (కొత్త పన్ను విధానం) అమలు కాక ముందే ప్రజలలో ఒక వర్గం (40 శాతం మంది) తమ ఆదాయంలో కేవలం బియ్యం, పప్పులు, కూరగాయలు, నిత్యావసర ఆహార సరుకులు కొనుగోలు చేయడానికే సరిపోయేదని వెల్లడించారు. అంటే ఇతర ఖర్చులైన విద్య, దుస్తులు, ప్రయాణాలకు డబ్బు వెచ్చించేందుకు వీలు కాకపోవడం కన్పించింది. ఆదాయ స్థాయి తక్కువగా ఉండటం, ఉద్యోగాల స్థిరత్వం లేకపోవడం వంటివి దీనికి ప్రధాన కారణాలుగా పేర్కొనవచ్చు. అయితే ఆహార వస్తువుల ధరలు పెరగడం వల్ల ప్రజలు 'ఫుడ్ షాపింగ్'కే పరిమితమయ్యారు.దీంతో జీఎస్టీ 2.0 రాకముందే ఈ పరిస్థితి ఉంటే కొత్త పన్ను విధానం తర్వాత ధరల పెరుగుదల, ఖర్చుల భారం మరింత ప్రభావం చూపే అవకాశం ఉంది. ముఖ్యంగా మధ్య తరగతి, తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలపై ఇది తీవ్రమైన ప్రభావం చూపుతుందని సర్వే సూచిస్తోంది. మొత్తం మీద జీఎస్టీ 2.0 అమలుకు ముందు కూడా సుమారు 40 శాతం వినియోగదా రులు కేవలం ఆహార అవసరాలను తీర్చుకోవడానికే పోరాడుతున్నారని సర్వే చూపిస్తున్నది.

జీఎస్టీ 2.0 అమలైతే అదనపు భారం ఇలా

%కొత్త జీఎస్టీని ఇప్పుడు కేవలం 5 శాతం, 18 శాతం శ్లాబ్‌లకే పరిమితం చేశారు. దీంతో కొన్ని వస్తువుల ధరలు పెరుగుతుండగా, మరికొన్ని తగ్గనున్నాయి. జీఎస్టీ 2.0లో పన్ను రేట్లు పెరిగితే వస్తువుల ధరలు కూడా పెరుగుతాయి. ముఖ్యంగా నిత్యావసరాలు, కిరాణా, ఆహార పదార్థాలు, విద్యుత్ బిల్లులు వంటివి అదనపు భారం అవుతాయి. ఫలితంగా సాధారణ ప్రజల జీవన వ్యయం పెరుగుతుంది. ఇప్పటికే 40 శాతం ప్రజలు ఆహారం కొనుగోలు చేయడానికే ఇబ్బంది పడుతున్నారని తాజా సర్వే చెబుతోంది. జీఎస్టీ 2.0తో ధరలు పెరగడంతో విద్య, ఆరోగ్యం, దుస్తులు, ప్రయాణం వంటి వాటిపై ప్రజల ఖర్చులు మరింత తగ్గిపోతాయి. అంటే ఇకపై విలాస, స్వేచ్ఛాపూరిత ఖర్చులు పూర్తిగా తగ్గిపోతాయి.పన్ను పెరుగుదల అన్ని వర్గాలపైనా ఎక్కువగానే ప్రభావం చూపినా మధ్య తరగతి, తక్కువ ఆదాయ వర్గాలపై ఎక్కువ భారం పడనుంది. బ్యాంకింగ్ చార్జీలు, రవాణా, విద్యా సేవలు, ఆరోగ్య సేవల మీద పన్ను ఎక్కువైతే వాటి భారం వినియోగదారుల నెత్తిపై పడుతుంది. అయితే జీఎస్టీ 2.0తో పన్ను వ్యవస్థ సరళీకరణ అవుతుందని, ఇది దీర్ఘకాల ప్రయోజనాన్ని ఇస్తుందని, పన్ను ఎగవేత తప్పుతుందని ప్రభుత్వం చెబుతున్నది. అయితే సాధారణ వినియోగదారులకు తక్షణ ప్రయోజనం కంటే తక్షణ భారమే ఎక్కువగా అనిపిస్తుంది. జీఎస్టీ 2.0 వల్ల వస్తువులు, సేవల ధరలు పెరిగే అవకాశం ఉండటంతో ప్రజల ఖర్చులు పెరిగి, జీవన ప్రమాణాలు క్షీణించే ప్రమాదం ఉంది. ముఖ్యంగా మధ్య తరగతి, పేద వర్గాలపై దీని ప్రభావం తీవ్రంగా పడనుంది.

పెరిగిన అప్పులు.. తగ్గిన పొదుపు

భారత దేశంలో 'జీవన వ్యయ సంక్షోభం కొంతవరకు ఉంది. అంటే గృహ పొదుపు శాతం నాలుగు సంవత్సరాల క్రితం కంటే నేడు తక్కువగా ఉంది. అయితే వాస్తవానికి బాధ్యతలు పెరిగాయి' అని పీడబ్ల్యూసీ రిటైల్ అండ్ కన్స్యూమర్ మార్కెట్ల లీడ్ డైరెక్టర్ హితాంషు గాంధీ అన్నారు. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ లావాదేవీల వ్యాపారి కేటగిరీ వారీగా విభజనపై నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ఇటీవల విడుదల చేయడం ప్రారంభించిన నెలవారీ డేటాను ప్రస్తావిస్తూ రుణం చెల్లింపు అధిక శాతం కుటుంబాలపై చాలా తీవ్రమైన ఒత్తిడిని పెంచుతున్నదని అన్నారు.

ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులపైనే తగ్గింపు ఎక్కువ

జీఎస్టీ ధర తగ్గింపు గొప్పగా ఉందని చాలామంది మురిసిపోతున్నారు. అయితే ఆ ధర తగ్గింపులో ఎక్కువ భాగం ఎలాక్ట్రానిక్స్ ఉత్పత్తిని కొనుగోలు చేయడం, యాత్రకు వెళ్లడం, బయట తినడం అంశాలకే పరిమితం అవుతుందని పిడబ్ల్యూసీ ఇండియా భాగస్వామి, రిటైల్, వినియోగదారుల రంగం నాయకుడు రవి కపూర్ అన్నారు. జీఎస్టీ రేటు తగ్గింపులు ఫార్మల్ సెక్టార్ తయారు చేసిన వస్తువులకు డిమాండ్‌ను పెంచుతాయని కూడా భావిస్తున్నారు. జీఎస్టీ రేటు తగ్గింపులు భారత దేశ వృద్ధి బేస్ పాయింట్లు (బీపీఎస్) పెంచుతాయని, ఒక పూర్తి సంవత్సరంలో రిటైల్ ద్రవ్యోల్బణాన్ని 100 బీపీఎస్ తగ్గించవచ్చునని ఆర్థికవేత్తలు అంచనా వేశారు. అయితే పన్ను తగ్గింపులో ఎంత భాగం తగ్గిన ధరల రూపంలో వినియోగదారులకు బదిలీ అవుతుందనే దానిపై ప్రశ్నలు మిగిలి ఉన్నాయి.

# మోడీ పాలనలో భారత్ 'ఒంటరి'



న్యూఢిల్లీ,నరేంద్ర మోడీ 2014లో ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి భారత విదేశాంగ విధానాన్ని ఒక కొత్త దిశలో నడిపించాలని ప్రకటించారు. 'నెయిబర్ హుడ్ ఫస్ట్' నుంచి 'ఆక్ట్ ఈస్ట్' వరకు విశ్వగురుగా భారతదేశాన్ని చూపించాలని ఆయన ఆకాంక్ష. కానీ, గత 11 సంవత్సరాలలో ఈ విధానం ఎన్నో లోపాలను, వైఫల్యాలను చవిచూసింది. నిపుణులు, రాజకీయ విశ్లేషకులు ఈ విధానాన్ని విమర్శిస్తూ, అది దేశ భద్రతకు, అంతర్జాతీయ సంబంధాలకు హాని కలిగించిందని చెబుతున్నారు. ముఖ్యంగా, పొరుగు దేశాలతో సంబంధాలు, చైనా, పాకిస్థాన్‌లతో వివాదాలు, ప్రపంచశక్తులతో సమన్వయం వంటి అంశాలలో ఎన్నో తప్పులు జరిగాయి. ముందుగా, పొరుగు దేశాల విధానాన్ని పరిశీలిస్తే, మోడీ ప్రభుత్వం 'నెయిబర్‌హుడ్ ఫస్ట్' అని ప్రకటించినా అది వాస్తవంలో వైఫల్యాన్నే చవిచూసింది. నేపాల్‌లో రాజ్యాంగ సవరణల విషయంలో భారత్ జోక్యం చేసుకోవటం వల్ల ఆ దేశంతో మన సంబంధాలు దెబ్బతిన్నాయి. 'కార్నెగీ ఎండావ్‌మెంట్ (విశ్లేషకులు ఈ జోక్యాన్ని విమర్శిస్తూ, అది నేపాల్‌లో భారత వ్యతిరేక భావనలనుపెంచి పోషించిందని చెప్పారు.బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోవటం కూడా భారతదేశానికి పెద్దదెబ్బ. హసీనా భారతదేశానికి మిత్రురాలు కావటంవల్ల గతంలో కంటే సంబంధాలు మెరుగుపడ్డాయి. కానీ, ఆమె పతనం తర్వాత ఆమెకు భారత్‌లో తలదాల్చుకొనే వసతులు, రక్షణ కల్పించటం, బంగ్లాదేశ్ ప్రజల్లో, తాత్కాలిక ప్రభుత్వం లోనూ భారత వ్యతిరేకత మరింత పెరిగింది. 'ది ఫెడరల్' విశ్లేషణలో ఈ సంఘటనను మోడీ విధానం ఊహించని ఫలితంగా పేర్కొన్నారు. మాల్దీవులు, శ్రీలంక వంటి దేశాలలో భారత్ ప్రభావం చైనా ఆధిపత్యానికి తలవంచాల్సి వచ్చింది. 'కార్నెగీ నిపుణులు' భారత్‌కు ఆర్థిక సామర్థ్యం లేకపోవటం వల్ల పొరుగు దేశాలను తన వైపు మళ్లించలేకపోయిందని విమర్శించారు.చైనాతో సంబంధాలు మోడీ విధానం పెద్ద వైఫల్యం. 2020 గాల్వాన్ సంఘటన తర్వాత సరిహద్దు వివాదాలు పరిష్కారం కాలేదు.'ఒఆర్ఎఫ్ విశ్లేషకులు' రక్షణ బడ్జెట్ తక్కువగా ఉండటం వల్ల చైనాను ఎదుర్కోవటం కష్టమని జనరల్ విపి మాలిక్ వంటి నిపుణులు హెచ్చరించారనిచెప్పారు. మోడీ ప్రభుత్వం చైనా దూకుడును తక్కువగా అంచనా వేసింది.ఫలితంగా భారత్ భూభాగాలు కోల్పోయింది. 'ఇండియా టుమారో'లో రాహుల్ గాంధీ ఈ విధానాన్ని 'పెద్ద తప్పు' అని విమర్శించారు. ఇండియా అనుసరించిన విధానాల వల్లనే పాకిస్థాన్ –చైనాలను దగ్గర చేసిందని చెప్పారు. పాకిస్థాన్‌తో సంబంధాలు మరింత దిగజారాయి. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవటంలో మోడీ విధానం పూర్తిగా విఫలమైంది. 2025లో జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడి తర్వాత ఆపరేషన్ సిందూర్ ప్రారంభమైంది కానీ, అమెరికా మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణ జరిగింది.'ఫెయిర్ అబ్జర్వర్' విశ్లేషకులు దీన్ని మోడీ ఘోర పరాజయంగా చూపారు. ట్రంప్ మధ్యవర్తిత్వం ప్రకటనలు భారత్‌ను ప్రపంచవ్యాప్తంగా అవమానపరిచిందని చెప్పారు. కాంగ్రెస్ నాయకుడు 'పృథ్వీరాజ్ చవాన్' ట్రంప్ –పాక్ ఆర్మీ చీఫ్ సమావేశాన్ని మోడీ విధానం వైఫల్యంగా ఘాటుగా విమర్శించారు. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చాక అమెరికాతో సంబంధాలు కూడా గతంలో ఎన్నడూ లేనంతగా దెబ్బతిన్నాయి. సిక్కు నాయకుడు హత్య కుట్ర ఆరోపణలు, మాస్కో పర్యటన సమయంలో ఉక్రెయిన్ దాడులు వంటివి వివాదాలు సృష్టించాయి.'ది ఫెడరల్' లో ఈ సంఘటనలను మోడీ విధానం ప్రశ్నార్థకమని విశ్లేషకులు చెప్పారు. ట్రంప్ అధ్యక్షత్వంలో 50% టారిఫ్‌లు విధించటం మోడీ దౌత్య వైఫల్యం. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే దీన్ని మోడీ పరాజయంగా విమర్శించారు. 'ఒఆర్ఎఫ్'లో సిఎఎ, ఎన్ఆర్‌సి వంటి దేశీయ విధానాలు అమెరికాతో భారత్ సంబంధాలను బాగా దెబ్బతీశాయని చెప్పారు. రష్యాతో భారత సంబంధాలు కూడా గతంలో కంటే భిన్నంగా మారాయి. ఉక్రెయిన్ యుద్ధంలో మోడీ తటస్థత వల్ల రష్యా కూడా తన వైఖరిని స్థానాన్ని మార్చుకుంది. రష్యాపాకిస్థాన్ మధ్య 2.8 బిలియన్ డాలర్ల ఒప్పందం భారత్‌కు పెద్దదెబ్బ. కాంగ్రెస్ నాయకురాలు షమా మహమ్మద్ దీన్ని మోడీ ప్రభుత్వ వైఫల్యంగా, జైశంకర్ రాజీనామా చేయాలని కూడా డిమాండ్ చేశారు. 'ఇండియా టుమారో'లో ముస్లిం దేశాలతో భారత్ సంబంధాలు దెబ్బతిన్నాయని, అమెరికా ప్రాపకం కోసం ఇజ్రాయెల్‌కు భారత్ అన్‌కండీషనల్ మద్దతు ఇవ్వటం వల్ల సాంప్రదాయకంగా అరబ్ వంటి మిత్రదేశాలు కూడా భారత్‌కు దూరమయ్యాయని భారత అలీన విధానానికి స్వస్తి చెప్పాలని రాహుల్ గాంధీ విమర్శించారు. ప్రపంచ వేదికలపై భారత్ స్థానం ఇప్పటికీ మెరుగుపడలేదు.యుఎన్ సెక్యూరిటీ కౌన్సిల్‌లో శాశ్వత సభ్యత్వం, ఎన్ఎస్‌జి సభ్యత్వం వంటివి ఏవీ భారత్ సాధించలేకపోయింది.ఫెయిర్ అబ్జర్వర్‌లో ఈ వైఫల్యాలను మోడీ పరిమితులుగా చూపారు. దేశీయ రాజకీయాలు విదేశాంగ విధానాన్ని ప్రభావితం చేయటం కూడా మరో పెద్ద లోపం. సిఎఎ వంటి చట్టాలు బంగ్లాదేశ్, అఫ్ఘానిస్థాన్ సంబంధాలను మరింత లోతుగా దెబ్బతీశాయి. ఒఆర్ఎఫ్ నిపుణులు దీన్ని స్వయంకృతాపరాధంగా వర్ణించారు. మొత్తం గా మోడీ విదేశాంగ విధానం వ్యక్తిగత డిప్లమసీపై ఆధారపడి, సంస్థాగత బలాన్ని నిర్లక్ష్యం చేసింది. స్వాతి చతుర్వేది వంటి జర్నలిస్టులు హగ్స్, ఫ్రెండ్ షిప్ క్లెయిమ్స్ విదేశాంగ విధానానికి నిర్వచనం కాదని విమర్శించారు. భవిష్యత్తులో భారత్ తన విదేశాంగ విధానాన్ని ప్రపంచ పరిస్థితులకు, పోకడలకు అనుగుణంగా మార్చుకుని, సమ్మిళితత్వం, బలమైన ఆర్థిక సంబంధాలు, రక్షణ సామర్థ్యం ద్వారా పెంచుకోవాలి. లేకుంటే, ఈ లోపాలు దేశాన్ని సువిశాల ప్రపంచ ప్రాంగణంలో మరింత ఒంటరిని చేస్తాయి.

# ప్రజలను ఎల్లకాలం మోసం చేయలేం...

గుంటూరు,ప్రజలను జగన్ ఎప్పుడో ఒకసారి మోసం చేయొచ్చు.. కానీ ప్రతిసారి మోసం చేయలేరని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ విమర్శించారు. గుంటూరు, రాజధాని ప్రజలు బాగా తెలివిగల వారని పెమ్మసాని చంద్రశేఖర్ ప్రశంసించారు. ఐదేళ్ల పాలనో ప్రజలనో మభ్య పెట్టారని, రాష్ట్రాన్ని దోచుకున్నారని అన్నారు. ఇంవతకన్నా దారుణం ఉంటుందా అని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సవాల్ విసిరారు. జగన్‌కు చేతనైతే మెడికల్ కళాశాలల్లో టెండర్లు పాడుకొని.. అభివృద్ధి చేయాలని ఛాలెంజ్ విసిరారు. గుంటూరులోని ప్రభుత్వ మహిళా కళాశాలను పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే నజీర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడారు. ఎవరికీ అధికారం ఇవ్వాలో ప్రజలకు బాగా తెలుసునని చెప్పుకొచ్చారు. వైసీపీ హయాంలో ఎయిమ్స్‌కు నీళ్లు, రోడ్లు ఇవ్వలేదని ధ్వజమెత్తారు. ప్రభుత్వ మహిళా కళాశాలను కూడా కాపాడలేని అసమర్థత జగన్ ప్రభుత్వానిదని విమర్శించారు. జగన్ ఇష్టానుసారంగా మాట్లాడటం చూస్తే నవ్వు వస్తోందని ఎద్దేవా చేశారు.

# వ్యాపారిని ఫాలో అవుతూ దారి దోపిడీ

రంగారెడ్డి,సెప్టెంబర్12(ఆర్ఎన్ఎ): శంకర్ పల్లి సమీపంలోని కొత్తపల్లి గ్రామం దగ్గర పట్ట పగలే దుండగులు దారి దోపిడీకి పాల్పడ్డారు. కారులో ప్రయాణిస్తున్న స్టీల్ వ్యాపారిని లక్ష్యంగా చేసుకుని దుండగులు ఏకంగా 40 లక్షల రూపాయలు దోచుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని జనతా స్టీల్ షాప్ నుంచి రూ.40 లక్షల నగదు తీసుకుని వస్తున్న వ్యాపారుల కారు కదలికలను ముందుగానే గమనించిన నలుగురు దుండగులు మరో కారులో ఫాలో అయ్యారు.అయితే, శంకర్‌పల్లి సమీపంలోని కొత్తపల్లి గ్రామం సమీపంలో అదును చూసుకున్న దుండగులు ఒక్కసారిగా స్టీల్ వ్యాపారి కారును ఢీకొట్టి, కారు అద్దాలు ధ్వంసం చేసి కత్తులు, బొమ్మ తుపాకీతో బెదిరించారు. ఇక, కారులో ఉన్న నగదు బ్యాగును బలవంతంగా లాక్కుని తమ వాహనంలో పారిపోతున్న క్రమంలో దుండగుల వాహనం ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సందర్భంగా రూ.8 లక్షల నగదు బ్యాగును అక్కడే వదిలి పెట్టి, మిగతా డబ్బుతో దుండగులు పరార్ అయ్యారు. ముందుగానే మరో కారును బ్యాకప్‌గా ఉంచుకున్న వారు కొంతదూరం పరిగెత్తి ఆ వాహనంలో ఎక్కి అక్కడి నుంచి పరార్ అయ్యారు. హుస్సేన్‌పూర్ గ్రామ శివారులో నిర్మానుష్యమైన ప్రాంతంలో ఆ వాహనాన్ని అడ్డగించిన దుండగులు దోపిడీకి పాల్పడారు. ముగ్గురు వ్యక్తులు ముఖాలకు మాస్క్‌లు ధరించి, కారు వద్దకు వచ్చి డ్రైవర్ కళ్ళలో కారం చెల్లి వెనుక సీటు-లో కూర్చున్న సాయిబాబా అనే వ్యక్తిపై దాడి చేసి, రాయితో అద్దం పగులగొట్టారు. కారులో ఉన్న ఇద్దర్నీ గాయపరిచి అందులోని రూ. 40 లక్షలు గల బ్యాగును తీసుకొని పరారయ్యారు. అతి వేగంగా కారులో పారిపోతున్న క్రమంలో నాలుగు కిలోమీటర్లు దాటిన తర్వాత కొత్తపల్లి గ్రామ శివారులో దుండగుల కారు అదుపుతప్పి పక్కనే ఉన్న కల్వర్టుకు ఢీకొట్టి బోల్తా పడింది. వెంటనే వారు బయటకు వచ్చి కారును అక్కడే వదిలి డబ్బు తీసుకొని పారిపోయారు. కారు బోల్తా పడిన శబ్దం రావడంతో చుట్టు-పక్కల ఇళ్లలో ఉన్న ప్రజలు సంఘటనా స్థలంలో గుమిగూడారు. దీనితో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే రాజేంద్రనగర్ డిసిపి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శంకర్‌పల్లి పోలీసులు, నార్సింగ్ ఏసిపి రమణ గౌడ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. విచారణలో భాగంగా క్లూస్ –టైమ్ ఫింగర్ ప్రింట్స్, డాగ్స్ స్క్వేర్ సహాయంతో సాక్ష్యాధారాలు సేకరించారు. సిసిఎస్, ఎస్ఒటి బృందాల సహాయంతో నిందితులను పట్టు-కునేందుకు పోలీసులు 4 బృందాలను ఏర్పాటు- చేసి గాలిస్తున్నారు. బోల్తా పడిన స్థలాన్ని పరిశీలించగా అందులో నిందులకు సంబంధించిన కొన్ని వస్తువులు, కొంత నగదును గుర్తించారు. దుండగులు బాధితులను వికారాబాద్ నుంచి పథకం ప్రకారం వెంబడించినట్లు-గా అర్థమవుతోంది. కాగా, దుండగులకు సంబంధించి పలుచోట్ల సిసి కెమెరాలలో దృశ్యాలు రికార్డయ్యాయని, త్వరలో నిందితులను పట్టు-కుంటామని శంకరపల్లి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

# ఏం జరుగుతోంది

హైదరాబాద్,ఆడబిడ్డ ఏడిస్తే ఇంటికి మంచిది కాదు అంటారు. తెలంగాణ సమాజం ఈ సామెతను బలంగా నమ్ముతుంది. ఆడబిడ్డను సాక్షాత్తు ఇంటి దేవతగా కొలుస్తూ ఉంటుంది. ప్రతి పండుగకు చీరె సారే పెడుతూ గౌరవించుకుంటుంది. దీనికి ఏ కుటుంబం కూడా మినహాయింపు కాదు. తెలంగాణ అంటేనే ఒక బలమైన అస్తిత్వానికి ప్రతీక. అందువల్లే ఇక్కడ చాలా దృఢమైన ఉద్యమాలు పుట్టాయి. ఆ ఉద్యమాలలో ఆడవారి పాత్రను బలంగా నిలుపుకున్నాయి. సమ్మక్క సారలమ్మ.. రుద్రమదేవి.. చాకలి ఐలమ్మ.. ఇలా చెప్పుకుంటూ పోతే వీరవనితలు.. ధీర వనితలు చాలామంది ఉన్నారు. వారందరూ ఇప్పటికీ కూడా ప్రజల మదిలో మెదులుతున్నారు. తెలంగాణ సమాజం తెలంగాణ ఉద్యమ సమయంలో ఆ వనితలను మననం చేసుకుంటూ ముందుకు సాగింది. తమ స్వీయ అస్తిత్వాన్ని కాపాడుకుంటూ అడుగులు వేసింది. అలా అడుగులు వేసిన వారిలో కల్వకుంట్ల కవిత కూడా ఒకరు.

సాంస్కృతిక ఉద్యమం

తెలంగాణ ఉద్యమ సమయంలో.. తెలంగాణకు అస్తిత్వం అయిన బతుకమ్మను నెత్తిన పెట్టుకుని ఆమె చేసిన సాంస్కృతిక ఉద్యమం మామూలుది కాదు. తెలంగాణ ఆడబిడ్డల్ని ఉద్యమంలో మమేకం చేయడానికి ఆమె ఎత్తుకున్న బతుకమ్మ ఎంతో మందిని కదిలించింది. కదిలి వచ్చేలా చేసింది. తెలంగాణ సాంస్కృతి.. తెలంగాణ సంప్రదాయం అంటేనే బూతు లాగా ధ్వనించిన ఒక సందర్భంలో.. బతుకమ్మ ద్వారా వాటన్నింటిని పటాపంచలు చేసింది కవిత. అందువల్లే ఆమె తెలంగాణ బతుకమ్మగా పేరుపొందింది. ఎంగిలి పూల నుంచి మొదలుపెడితే సద్దుల బతుకమ్మ వరకు ఆమె అడుగు పెట్టని ఊరంటూ లేదు. గౌరమ్మను నిలుపుకోవడం.. తంగేడు పూలతో బతుకమ్మను పేర్చడం.. పాటలు పాడి చెరువులో నిమజ్జనం చేయడం.. ఇదే క్రతువుగా సాగిపోయింది కవిత. అటువంటి బతుకమ్మకు నేడు కష్టం వచ్చింది. పుట్టిన ఇంటి నుంచి ఇబ్బందికరమైన వాతావరణం ఎదురైంది. పండగపూట ఏ ఆడబిడ్డకు ఇటువంటి కష్టం రావద్దు. ఇటువంటి ఇబ్బంది అసలు రావద్దు. పున్నమి 15 రోజుల్లో వెలుగు వెలిగే చంద్రుడు కూడా.. అమావాస్య రోజులలో మసకబారతాడు. అలాగని ఎప్పటికీ చీకట్లో ఉండిపోడు. ఇప్పుడు కవిత పరిస్థితి కూడా అలాంటిదే. తాత్కాలికంగా ఆమె ప్రభ కొంతమేర ఇబ్బందికి గురైనప్పటికీ.. ఆ తర్వాతి రోజుల్లో దీపశిఖలాగా వెలుగుతూనే ఉంటుంది. కర్మ సిద్ధాంతాన్ని బలంగా నమ్మే ఆమె.. ఎట్టి పరిస్థితుల్లోనూ తన ప్రభను కోల్పోరు.

మేమున్నాం..

పుట్టినింటి నుంచి కాస్త ఇబ్బంది ఎదురవుతున్నప్పటికీ.. మేమున్నామంటూ పుట్టిన గడ్డవాళ్ళు కవిత దగ్గరికి వచ్చారు. కెసిఆర్ స్వగ్రామం చింతమడక గ్రామస్తులు తెలంగాణ బతుకమ్మ దగ్గరికి స్వయంగా వచ్చి ఎంగిలిపూల బతుకమ్మ వేడుకల్లో భాగస్వామి కావాలని స్వాగతం పలికారు. చీర, సారె, పసుపు కుంకుమలతో సాదర ఆహ్వానం పలికారు. ఒక ఆడబిడ్డకు ఇంతకంటే కావలసిందేముంది. పండగ పూట ఇంతకంటే ఘనమైన ఆతిథ్యం ఇంకొకటి ఏమంటుంది. ఇది తెలంగాణ బతుకమ్మకు దక్కిన నిండైన గౌరవం. కెసిఆర్ కుమార్తెకు కెసిఆర్ స్వగ్రామం నుంచి లభించిన గొప్పదైన సత్కారం. ఇప్పుడు కవిత మనసు చాలా తేలికైంది. గుండెలో భారం తగ్గిపోయింది. ఎందుకంటే తెలంగాణ బతుకమ్మ దగ్గరికి బతుకమ్మ వడివడిగా అడుగులు వేసుకుంటూ వచ్చింది కాబట్టి..

# రియల్ వ్యాపారి దారుణహత్య

మేడ్చల్, మేడ్చల్ జిల్లా కాప్రాలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో దారుణం చోటు-చేసుకుంది. నడిరోడ్డు మీద అందరూ చూస్తుండగానే రియల్ ఎస్టేట్ వ్యాపారి శ్రీకాంత్‌రెడ్డిని ఓ దుండగుడు హత్య చేశాడు. అడ్డువచ్చిన వ్యక్తిని కత్తితో బెదిరించి.. అక్కడి నుంచి పారిపోయాడు. సమాచారం అందుకున్న కుషాయిగూడ పోలీసులు.. ఘటనా స్థలిని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు- తెలిపారు. శ్రీకాంత్ వ్యాపార భాగస్వామే చంపి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

# రాహుల్ లాలూ కొడుకు అన్నదమ్ముల బంధం ఏమైంది ?



పాట్నా:ఈ మధ్యనే బీహార్ లో ఏకంగా పదిహేను రోజుల పాటు కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఓటర్ అధికార్ యాత్రను నిర్వహించారు. ఈ యాత్రలో ఆయనతో కలిసి ఆర్జేడీ పార్టీ కీలక నాయకుడు బీహార్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు అయిన తేజస్వి యాదవ్ పాల్గొన్నారు. ఈ ర్యాలీలు సభలు విజయవంతం అయ్యాయి. అయితే ఆ తరువాతనే బీహార్ లో మహా ఘట్ బంధానికి బీటలు వారడం మొదలైంది అని అంటున్నారు.

ఒంటరిగానే పోటీ అంటూ :

ఇక బీహార్ లో ఒంటరిగానే తాము పోటీ చేస్తామని మొత్తం 243 అసెంబ్లీ సీట్లకు తాము రెడీ అని లాలూ కొడుకు ఆర్జేడీ సీనియర్ నేత తేజస్వి యాదవ్ ప్రకటించారు. ఈ ప్రకటన మహా ఘట్ బంధం మీద తీవ్ర ప్రభావం చూపే అవకాశం కనిపిస్తోంది. అన్న దమ్ములుగా ఉంటూ రాహుల్ తేజస్వి యాదవ్ ర్యాలీలలో హుషారుగా పాల్గొన్నారు. బీహార్ లో వచ్చేది మహా ఘట్ బంధన్ సర్కారే అని కూడా గట్టిగా చెప్పారు. అయితే ఏమి జరిగిందో ఏమో కానీ ఇపుడు సడెన్ గా ఆర్జేడీ ఫేస్ టర్నింగ్ ఇచ్చుకుంది అని అంటున్నారు.

అదే రీజన్ నా :

అయితే ఎందుకు ఈ విధంగా తేజస్వి యాదవ్ స్టేట్మెంట్ ఇచ్చారు అంటే దానికి రీజన్ కూడా ఉంది అని అంటున్నారు. ఈసారి కచ్చితంగా మహా ఘట్ బంధం గెలుస్తుంది అన్న సూచనలు ఒక వైపు ఉన్నాయి. మరో వైపు ఓటర్ అధికార్ యాత్ర రాహుల్ నిర్వహిస్తే బీహార్ లో విరగబడి జనాలు వచ్చారు. దాంతో కాంగ్రెస్ కి మళ్ళీ అక్కడ పూర్వ వైభవం వస్తోంది అని అగ్ర నేతలు భావిస్తున్నారుట. ఈ కారణంగానే గతంలో మాదిరిగా మొక్కుబడిగా ఏ పదో పదిహేనో సీట్లు కాకుండా భారీ స్థాయిలోనే సీట్లను కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది అని అంటున్నారు. తమకు కూడా సమాన వాటా కావాలని కోరుతోంది అన్నది టాక్. అలా అయితే రేపటి రోజున ప్రభుత్వం ఏర్పాటులోనూ కీలక పాత్ర పోషించడమే కాకుండా వీలుంటే అధికారంలోనూ వాటా కోరవచ్చు అన్న దీర్ఘ కాలిక ఆలోచనలు ఉన్నాయని అంటున్నారు.

సీఎం ఎవరో చెప్పలేదా :

అంతే కాకుండా రాహుల్ ని బీహార్ లో మీడియా అడిగిన ఒక ప్రశ్నకు ఆయన నుంచి ఆర్జేడీ ఆశించిన జవాబు రాకపోవడం వల్ల కూడా ఆ పార్టీ అలిగింది అని అంటున్నారు. మహా ఘట్ బంధన్ గెలిస్తే ఎవరు సీఎం అవుతారు అన్న ప్రశ్నకు రాహుల్ తేజస్వి యాదవ్ తన పక్కన ఉన్నా కూడా ఆయన పేరు చెప్పకపోవడం మీద కూడా తమ్ముడు గుస్సా అయ్యారని అంటున్నారు. మొత్తం మీద చూస్తే కాంగ్రెస్ కి బీహార్ ఎన్నికల మీద ధీమా బాగా పెరిగిందని అంటున్నారు. ఆ కారణంగానే సీట్లను అధికంగా డిమాండ్ చేయడంతో ఎవరి పొత్తు లేకుండా తాము ఒంటరిగా గెలవగలమని తేజస్వి యాదవ్ ధీమాగా ఈ ప్రకటన చేశారు అని అంటున్నారు. చూడాలి మరి ఇది ఇలాగే సాగుతుందా ఎక్కడో అక్కడ మళ్ళీ ఇద్దరూ తగ్గి వస్తారా అన్నది.

# ‘జూబ్లీహిల్స్ మాదే.. సర్వేలన్నీ మనవైపే’

హైదరాబాద్,త్వరలోనే జరగనున్న జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికపై సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాజాగా ఆయన ఈ నియోజకవర్గానికి సంబంధించిన డివిజన్ల నాయకులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా.. ఆయన వారికి కొన్ని సూచనలు, సలహాలు చేశారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ సహా.. బీజేపీల వ్యూహాలపైనా వారితో చర్చించారు. ఆదివారం రాత్రి జరిగిన ఈ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ విజయంపై ధీమా వ్యక్తం చేశారు. తాను అంతర్గతంగా ఈ నియోజకవర్గం లో రాజకీయ పరిస్థితులు.. పరిణామాలపై సర్వే చేయించినట్టు చెప్పారు.దీని ప్రకారం.. కాంగ్రెస్ అభ్యర్థే విజయం దక్కించుకుంటారని సర్వేలు తేల్చి చెప్పాయన్నారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ, ఉచిత ఆర్టీసీ బస్సు, రైతులకు మేళ్లు వంటివి కలిసివస్తున్నాయన్నారు.

ముఖ్యంగా హైదరాబాద్ అభివృద్ధి సహా.. ఫ్యూచర్ సిటీ ప్లాన్ వంటివి ప్రజల మధ్య చర్చకు వచ్చాయని.. దీంతో అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్న తమకు ప్రజలు అనుకూలంగా ఉన్నారని తెలిపారు. అయితే.. అలాగని నిర్లక్ష్యంగా ఉండొద్దని నాయకులకు,కార్యకర్తలకు కూడా ఆయన సూచించారు. ప్రతి విషయాన్నీ ప్రజల మధ్యకు తీసుకువెళ్లాలన్నారు. హైదరాబాద్ అభివృద్ధి సహా..ఫ్యూచర్ సిటీ అంశాలను ప్రజలకు వివరించాలన్నారు.ఇదేస మయంలో సీఎం రేవంత్ రెడ్డి.. కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ అవినీతి, అక్రమాలను ప్రజల మధ్యకు తీసుకువెళ్లాలని సూచించారు. హైదరాబాద్ అభివృ ద్ధికి కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమే పనిచేసిందన్నారు. గతంలో బీఆర్ఎస్ పా ర్టీ చేసింది ఏమీ లేదన్నారు. శంషాబాద్ విమానాశ్రయం సహా.. రహదారుల వెడల్పు వంటివి కాంగ్రెస్ హయాంలోనే జరిగాయన్నారు. అదేవిధంగా రైతులకు రుణ మాఫీ చేశామన్నారు.



బీఆర్ ఎస్ సహా బీజేపీలకు హైదరాబాద్ అభివృద్ధిలో ఎలాంటి పాత్ర లేదని.. కానీ, వారు చెప్పుకొనే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో వారి ప్రచారాన్ని తిప్పికొట్టాలని సీఎం రేవంత్ దిశానిర్దేశం చేశారు.

వార్డుల వారీగా ప్రచారం..

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో వార్డుల వారీగా ప్రజలను కలిసి ప్రచారం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ప్రతి ఇంటినీ సందర్శించాలన్నారు. ప్రతి ఓటూ కాంగ్రెస్‌కు పడేలా చూడాలని తెలిపారు. బూతుల వారీగా ప్రచారం నిర్వహించేందుకు బ్లూ ప్రింట్ రెడీ చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల ప్రచారంతోపాటు స్థానికంగా ఉన్న సమస్యలను కూడా తెలుసుకుని.. వాటిని పరిష్కరించేందుకు భరోసా ఇవ్వాలని సూచించారు. ప్రతి విషయాన్ని సీరియస్‌గా తీసుకుని ముందుకు సాగాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు.

# తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపు..

హైదరాబాద్, తెలంగాణ అసెంబ్లీలో జరుగుతున్న డిఫెక్షన్ కేసులు రాజకీయ పార్టీల మధ్య ఉద్రిక్తతను పెంచుతున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ (భారత్ రాష్ట్ర సమితి) టికెట్‌పై గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ కేసులు యాంటీ%-%డిఫెక్షన్ చట్టాన్ని, రాజ్యాంగ స్థానాన్ని ప్రశ్నించేలా మలుపు తిప్పుతున్నాయి. సుప్రీం కోర్టు ఆదేశాలు, స్పీకర్ నోటీసులు, పార్టీల వాదనలు ఈ ఘటనలు తెలంగాణ రాజకీయాల్లో కొత్త అధ్యాయాన్ని రాస్తున్నాయి.2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత, బీఆర్ఎస్ నుంచి 10 మంది ఎమ్మెల్యేలు దాదంబోయినా నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకటరావు, పోచారం శ్రీనివాస్ రెడ్డి, కలె యాదయ్య, ఎం. సంజయ్ కుమార్, కృష్ణమోహన్‌రెడ్డి, మహీపాల్ రెడ్డి, ప్రకాశ్ గౌడ్, అరికెపూడి గాంధీ కాంగ్రెస్‌లో చేరినట్టు బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. కాంగ్రెస్ సభ్యత్వం స్వీకరించి, ట్రెజరీ బెంచీల్లో కూర్చున్నారని బీఆర్ఎస్ వాదన. ఇది యాంటీ-డిఫెక్షన్ చట్టానికి (10వ షెడ్యూల్) విరుద్ధమని, డిస్క్వాలిఫికేషన్ పిటిషన్లు 2024 మార్చి-ఏప్రిల్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు సమర్పించారు. సుప్రీం కోర్టు 2025 జూలై 31న జారీ చేసిన ఆదేశాల్లో, స్పీకర్‌కు మూడు నెలల్లోపు నిర్ణయం తీసుకోవాలని డైరెక్ట్ చేసింది. దీంతో 2025, ఆగస్టు 23న స్పీకర్ 10 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారా లేదా అనే వివరణ కోరారు. ఇది డిఫెక్షన్ కేసుల్లో స్పీకర్ నిర్ణయాలపై రాజ్యాంగపరమైన ప్రశ్నలను లేవనెత్తింది. కోర్టు, స్పీకర్/ఛైర్మన్‌లకు డిఫెక్షన్ నిర్ణయాల బాధ్యతను అప్పగించడం సమర్థవంతమా అని పార్లమెంట్‌ను పరిశీలించమని సూచించింది.

బీఆర్ఎస్‌లోనే ఉన్నామని ఎమ్మెల్యేల వివరణ..

స్పీకర్ నోటీసులకు స్పందిస్తూ, 10 మంది ఎమ్మెల్యేలలో 8 మంది 2025 సెప్టెంబర్ 11 నాటికి వివరణలు సమర్పించారు. వారంతా ఐక్యంగా, ‘మేము బీఆర్ఎస్‌లోనే ఉన్నాం, కాంగ్రెస్‌లో చేరలేదు‘ అని పేర్కొన్నారు. ముఖ్యంగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశాలు నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సేవల కోసమే అని వాదించారు. కొందరు ‘టెక్నికల్‌గా బీఆర్ఎస్‌లోనే ఉన్నాం‘ అని, సోషల్ మీడియా హ్యాండిల్స్ మార్చలేదని చెప్పుకున్నారు. ఈ ఎమ్మెల్యేలు తమ చట్టపరమైన సలహాలతో స్పందిస్తున్నారు. కొందరు ఢిల్లీలో సుప్రీం కోర్టు



న్యాయవాదులను సంప్రదించి, ప్రజల సేవ కోసం అధికార పార్టీలోకి వెళ్లామని, ద్రోహం చేయలేదని వాదిస్తున్నారు.

బీఆర్ఎస్ ఆధారాలతో కౌంటర్

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వివరణలను తిరస్కరిస్తూ, 2025 సెప్టెంబర్ 13 (శనివారం) నాటికి స్పీకర్‌కు కౌంటర్ వాదనలు సమర్పించనుంది. పార్టీ నేతలు, ‘ఎమ్మెల్యేలు కాంగ్రెస్ నేతల సమక్షంలో చేరారు, కాంగ్రెస్ సమావేశాల్లో పాల్గొన్నారు, కట్టడి బెంచీల్లో కూర్చున్నారు‘ అని ఆరోపిస్తున్నారు. సోషల్ మీడియా, యూట్యూబ్‌లో డిజిటల్ ఆధారాలు సేకరిస్తున్నారు. దానం నాగేందర్ 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేశారు. కడియం శ్రీహరి కూతురు బీఆర్ఎస్ టికెట్ ఇచ్చాక దానిని తిరస్కరించి కాంగ్రెస్‌లో చేరి పోటీచేసి గెలిచారు. ఈ ఫిరాయింపుల వివాదం తెలంగాణ రాజకీయాల్లో అస్థిరతను తెలియజేస్తోంది. బీఆర్ఎస్ 2023లో 39 సీట్లతో రెండో స్థానంలో ఉండగా, 10 మంది ఎమ్మెల్యేలు చెరస్తే 29కి తగ్గుతుంది. ఇది పార్టీ బలాన్ని బలహీనపరుస్తుంది. కాంగ్రెస్‌కు (64 సీట్లు) ఇది అదనపు మద్దతు. కానీ డిస్క్వాలిఫికేషన్ అయితే బై%-%ఎలక్షన్లు జరగవచ్చు. అప్పుడు రాజకీయ పరిణామాలు మారే అవకాశం ఉంది. చట్టపరంగా ఫిరాయింపులను నిరోధిస్తుంది. కానీ ఎమ్మెల్యేలు ‘స్వచ్ఛందంగా‘ పార్టీ మారితే పార్టీ విలీనం ద్వారా మినాయింపు పొందుతారు. బీఆర్ఎస్ ఆధారాలు (వీడియోలు, సమావేశాలు) బలంగా ఉంటే స్పీకర్ డిస్క్వాలిఫికేషన్‌కు ఆమోదం ఇవ్వవచ్చు. స్పీకర్ నిర్ణయం తెలంగాణ రాజకీయాల్లో కొత్త మలుపును తీసుకురావొచ్చు.

# కార్పొరేట్ వివాదం కాదు.. అన్నాచెల్లెళ్ల మధ్య రచ్చ..



హైదరాబాద్,ఆస్తుల పంపిణీకి సంబంధించి దివంగత మహానేత వైఎస్ కుటుంబ సభ్యుల మధ్య నడుస్తున్న పంచాయితీకి సంబంధించి చెన్నైలోని జాతీయ కంపెనీ లా అప్పిలెట్ ట్రైబ్యునల్ కు తాజాగా విజయమ్మ కీలక అంశాల్ని నివేదించారు. సరస్వతి పవర్ లిమిటెడ్ లో వాటాల బదలాయింపు.. రిజిస్టర్ లో వాటాదారుల పేర్ల మార్పుపై జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ హైదరాబాద్ బెంచ్ లో వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిటిషన్ దాఖలు చేయటం తెలిసిందే. దీనికి సంబంధించి విజయమ్మ తాను దాఖలు చేసిన పిటిషన్ లో తన వాదనను వినిపించారు.వైఎస్ జగన్మోహన్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ కు సంబంధించి ఇదేమీ కార్పొరేట్ వివాదం కాదని.. షర్మిలకు జగన్ కు మధ్య ఉన్న రాజకీయ కలహాల్ని పరిష్కరించుకునే ప్రయత్నం తప్పించి మరోటి కాదంటూ ఆమె పేర్కొన్నారు. ఇద్దరూ తన పిల్లలు కావటంతో వారి రాజకీయ గొడవల్లో తాను చిక్కుకున్నట్లు పేర్కొన్నారు. కుటుంబ వివాదానికి కార్పొరేట్ రంగు పులిమి వాటిని తమ రాజకీయ మైలేజీకి వినియోగించుకోవటం విచారకరమని వాపోయారు.అసలీ వివాదంలోకి వెళితే.. విజయమ్మ.. జనార్దన్ రెడ్డిల పేర్లతో వాటాలను బదలాయిస్తూ సరస్వతి పవర్ బోర్డు తీర్మానాన్ని.. దీని ప్రకారం రిజిస్టర్ లో సభ్యుల పేర్లను మార్చటాన్ని జగన్.. భారతీరెడ్డి.. క్లాసిక్ రియాల్టీలు సవాలు చేయటం తెలిసిందే. వాటాల బదలాయింపును రద్దు చేస్తూ జగన్ తదితరుల పేర్లను పునరుద్ధరించాలని కోరుతూ జులై 29న తీర్పు వెలువడింది.హైదరాబాద్ లోని జాతీయ కంపెనీ లా అప్పిలెట్ ట్రైబ్యునల్ వెలువరించిన తీర్పును సవాలు చేస్తూ.. దాని అమలును నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ చెన్నైలోని ట్రైబ్యునల్ కు విజయమ్మ అప్పీలు దాఖలు చేశారు. విజయమ్మ తరఫున ఆమె లాయర్ ఈ అప్పీల్ ను దాఖలు చేశారు. ఇందులో భాగంగా విజయమ్మ దాఖలు చేసిన పిటిషన్ లో ఆమె పలు అంశాల్ని ప్రస్తావించారు. ఈ పిటిషన్ ను చెన్నై ట్రైబ్యునల్ త్వరలో విచారించనుంది.విజయమ్మ దాఖలు చేసిన పిటిషన్ లో పేర్కొన్న అంశాల్ని చూస్తే.. “1999లో సరస్వతి పవర్ ఏర్పాటైంది. ఈ సంస్థకు గుంటూరులో 903.28 ఎకరాల భూమి ఉంది. వాటాల బదలాయింపునకు ముందు జగన్ కు 29.88 శాతం.. భారతీరెడ్డికి 16.30 శాతం.. క్లాసిక్ రియాల్టీకి 4.83 శాతం.. నాకు (విజయమ్మ) 48.99 శాతం వాటాలున్నాయి. 2021 జులై 26న జగన్ 74.26 లక్షల.. భారతీరెడ్డి 40.50 లక్షల వాటాల్ని ప్రేమతో నా పేరు మీద గిఫ్టు డీడ్ ఇచ్చారు. తర్వాత మాట మార్చి..వాటి ఆధారంగా జరిగిన లావాదేవీలను కార్పొరేట్ వివాదం పేరుతో ప్రశ్నించటానికి వీల్లేదు” అని పేర్కొన్నారు.క్లాసిక్ రియాల్టీతో రూ.3.07 కోట్లు చెల్లించి 11.38 లక్షల వాటాల్ని కొనుగోలు చేశానని.. వాటాలను కానుకగా ఇచ్చినట్లుగా విజయమ్మ పేర్కొన్నారు. “2021 ఆగస్టు 14న జగన్మోహన్ రెడ్డి డైరెక్టర్ పదవికి రాజీనామా చేశారు. దీంతో సరస్వతి కంపెనీతో అతనికున్న బంధం ముగించినట్లుగా జగన్ భావించారు. గిఫ్టు ఒప్పందాలను.. వాటాల కొనుగోలు ఒప్పందాల చెల్లుబాటును ఏ సివిల్ కోర్టులోనూ సవాలు చేయలేదు. అలాంటప్పుడు కార్పొరేట్ ముసుగులో వాటిని ట్రైబ్యునల్ లో సవాలు ఎలా చేస్తారు?” అని ఆమె ప్రశ్నించారు.జగన్ తో తాను కలిసి ఉన్నప్పుడే తనకు వాటాల్ని కానుకగా ఇచ్చినట్లుగా పేర్కొన్న విజయమ్మ.. “అప్పుడు ఒరిజనల్ వాటా సర్టిఫికేట్ లు.. వాటాల బదలాయింపు దరఖాస్తుల్నిఇవ్వగా నాతో వాటిని ఉంచుకున్నా. ఆ తర్వాత ఫ్యామిలీలో వివాదాలు.. విభేదాలు తలెత్తాయి. రాజకీయ విభజనకు దారి తీసింది. ఈ వివాదాల వేళ జగన్ నన్ను.. కుటుంబ సభ్యుల్ని వదిలేసి వెళ్లిపోయారు. ఒరిజనల్ వాటా సర్టిఫికేట్లను జగన్ ఎస్ సీ ఎల్ టీలో పిటిషన్ వేసిన సమయంలో జత చేయలేదు. కంపెనీ చట్ట నిబంధనల ఉల్లంఘన జరగలేదంటూ కౌంటర్ దాఖలు చేసిన తర్వాత ఒరిజినల్ సర్టిఫికేట్లను సమర్పించారు” అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆమె కొన్ని ప్రశ్నల్ని సంధించారు. అందులో ముఖ్యమైనది.. “నేను పిటిషన్ వేసేటప్పుడే ఒరిజినల్ సర్టిఫికేట్లను ఎందుకు సమర్పించ లేదు? 2024 ఆగస్టు 21 న జగన్ ఇచ్చిన మూడులీగల్ నోటీసుల్లో ఈడీ జప్తు ఉండగా.. వాటాల బదలాయింపు చేయరాదన్న ఒప్పందానికి విరుద్ధమని మాత్రమే పేర్కొన్నారు. అప్పటికే వాటాలను

# సామాజిక వర్గ అభ్యున్నతికి పాటు పడదాం



హైదరాబాద్,వడ్డెర సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకుంటూ అభ్యున్నతికి పాటుపడదామని అఖిలభారతం వడ్డెర వడ్డే సంక్షేమ సేవా సంఘం జాతీయ అధ్యక్షులు వేముల లక్ష్మణ్ పిలుపునిచ్చారు. సంఘాన్ని బలోపేతం చేసేందుకు కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు ఆయన ప్రకటించారు. జాతీయ ప్రధాన కార్యదర్శి గా గుంజా శ్రీనివాస్ ఉపాధ్యక్షుడిగా దండుగుల అశోక్, జాతీయ సంయుక్త కార్యదర్శిగా మక్కల శేఖర్ యువజన అధ్యక్షుడిగా డాక్టర్ వేముల లోకేష్ యువజన కార్యదర్శిగా డాక్టర్ వేముల శ్రీనివాస్ రాష్ట్ర కార్యదర్శిగా వేముల మధుసూదన్ లను నియమించినట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో ఉన్న వడ్డెరలను ఐక్యం చేసి సామాజిక వర్గం సమస్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుంటామని అన్నారు. పేదరికంలో మగ్గుతున్న వడ్డెరలను సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల ద్వారా అన్ని రంగాలలో అభివృద్ధికి కృషి చేసేందుకు కార్యవర్గం శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు.

# బిజెపిలో చేరికలకు టిడిపి గ్రీన్ సిగ్నల్!



అమరావతి, ఏపీలో విచిత్ర రాజకీయ పరిస్థితులు నడుస్తున్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని టార్గెట్ చేసింది కూటమి. కూటమిని దెబ్బతీయాలని భావిస్తోంది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ. ఇలా ఇరుపక్షాల మధ్య గట్టి ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే ఎలాగైనా బలం పుంజుకోవాలని భావిస్తోంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అదే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని బలహీన పరచాలని చూస్తోంది కూటమి. ఈ క్రమంలో ఇప్పుడు బిజెపి బలం పెంచడం ద్వారా.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని బలహీనం చేయాలని చూస్తోంది తెలుగుదేశం పార్టీ. అందుకు గట్టి ప్రణాళికలు వేస్తోంది. అందులో భాగమే వైసీపీ ఎమ్మెల్సీ పోతుల సునీత బిజెపిలో చేరడం.

తిరిగి వైసీపీలో చేరుతున్న క్రమంలో

కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చాలామంది కూటమి పార్టీల్లో చేరారు. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఎటువంటి వివాదాలు లేని నాయకులను టిడిపిలో చేర్చుకుంది నాయకత్వం. అయితే ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీకి బలమైన నాయకత్వం ఉంది. మరోవైపు జనసేనలో సైతం చేరికలు పెరిగాయి. అయితే ఆ పార్టీలో చేరితే భవిష్యత్తులో అవకాశం దక్కుతుందన్న వారు మాత్రమే చేరుతున్నారు. మిగతావారు అయిష్టంగానే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ వచ్చారు. అయితే కూటమి పార్టీల నుంచి గ్రీన్ సిగ్నల్ లభించకపోవడంతో వారి మనసు మారుతోంది. తిరిగి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే స్ట్రాంగ్ అయ్యేందుకు వారు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఈ పరిస్థితిని గమనించిన తెలుగుదేశం పార్టీ ఇప్పుడు సరికొత్త ప్రయోగం చేయడం ప్రారంభించింది. అటువంటి నేతలను బిజెపిలోకి పంపించడం ద్వారా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని బలహీనం చేయాలని ఒక నిర్ణయానికి వచ్చింది.

అందులో భాగంగానే వైసీపీ ఎమ్మెల్సీ పోతుల సునీత బిజెపిలో చేరారు. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు రావాలనుకున్న నేతలంతా ఇప్పుడు బిజెపిలోకి వెళ్తారు అన్నమాట.

అప్పట్లో మూడు పార్టీల మధ్య ఒప్పందం..

కూటమి అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో కొంతమంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు కూటమి పార్టీలో చేరారు. అయితే వైసిపి హయాంలో వివాదాస్పద ముద్ర పొందిన నేతలు సైతం చేరేందుకు సిద్ధపడ్డారు. అయితే వారి రాకతో కూటమిలో ఇబ్బంది కరం ఉంటుందని భావించిన తెలుగుదేశం పార్టీ చేరికలకు బ్రేక్ వేసింది. మరోవైపు 2019 తర్వాత టిడిపి అనుసరించిన ఫార్ములానే వైసీపీ సైతం అనుసరించడానికి సిద్ధమయింది. తద్వారా టిడిపి కూటమిలో విచ్ఛిన్నం, పొత్తు లేకుండా చేయడం వంటివి చేసేందుకు కొంతమంది వైసీపీ నేతలు బిజెపిలో చేరేందుకు సిద్ధపడినట్లు టిడిపి అనుమానించింది. అందుకే చేరికల విషయంలో మూడు పార్టీల మధ్య అవగాహన ఉండాలని.. అందరి సమ్మతంతోనే పార్టీల్లో చేరిక ఉండాలని ఒక షరతు పెట్టింది టిడిపి. దీంతో కూటమి పార్టీల్లో వైసీపీ నేతల చేరికకు బ్రేక్ పడింది.

ఆ ఎమ్మెల్సీ చేరిక వెనుక..

ప్రస్తుతం వైసీపీ ఎమ్మెల్సీ పోతుల సునీత బిజెపిలో చేరారు. ఏకంగా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సమక్షంలో ఆమె చేరడం విశేషం. వాస్తవానికి ఆమె తెలుగుదేశం పార్టీ బ్యాగ్రౌండ్ కలిగిన నాయకురాలు. పరిటాల కుటుంబానికి సన్నిహితురాలు. తప్పకుండా ఆమె టిడిపిలో చేరాలి. కానీ మారిన టిడిపి వ్యూహంతోనే ఆమె బిజెపిలో చేరినట్లు సమాచారం. వైసీపీలో ఉండడానికి ఇష్టపడిన నేతలు, గత ఎన్నికల్లో వైసీపీకి వ్యతిరేకంగా వ్యవహరించిన నాయకులు ఇప్పుడు కచ్చితంగా బిజెపిలో చేరుతారు. తద్వారా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపడకుండా చూడడం, బిజెపిని బలం పెంచి వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీ సేవలను వినియోగించుకోవడం చేయాలన్నది టిడిపి ప్లాన్ గా తెలుస్తోంది.

# హైప్ ఎక్కించుకుంటున్న టీవీకే విజయ్ !

చెన్నై:తమిళనాడు రాజకీయాల్లో అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న విజయ్.. పూర్తి స్థాయిలో పర్యటనలు ప్రారంభించారు. ‘మీట్ ది పీపుల్’ పేరుతో రోడ్ షోలు ప్రారంభించారు. తిరుచ్చి నుంచి ప్రారంభించారు. విజయ్ కు ఉన్న స్టార్ డమ్ కారణంగా జన సమీకరణ కూడా అవసరం ఉండదు. ఆయన పర్యటిస్తే సహజంగానే జనం వస్తారు. పార్టీ టిక్కెట్ ఆశించే నేతలు మరింత షో చేస్తారు. టూర్లు సక్సెస్ కావడం ఖాయం. అది చాలా హైప్ ఇస్తుంది.సినిమాలకు ఓపెనింగ్స్ రావడానికి హైప్ చాలా ముఖ్యం. అది ఎలా తెచ్చుకోవాలో విజయ్ కు క్లారిటీ ఉంది. అందుకే ముందస్తుగా మీట్ ది పీపుల్ అని .. ర్యాలీలు ప్రారంభించారు. డిసెంబర్ నుంచి ఎన్నికల ప్రచార సభలు నిర్వహించబోతున్నారు. తమిళనాడు రాజకీయాల నుంచి జలలలిత, కరుణానిధి కొద్ది తేడాతో వెళ్లిపోవడంతో.. అక్కడ నాయకత్వ శూన్యత ఉంది. స్టాలిన్ తర్వాత ఆ స్థాయి నాయకుడు ఎవరూ కనిపించడంలేదు. ఆ రేసులో తాను కూడా ఉండాలని.. విజయ్ గట్టిగా ప్రయత్నిస్తున్నారు.విజయ్ తన చివరి సినిమాను పూర్తి చేశారు. అది కూడా రాజకీయంగా ఉపయోగపడేలా ఉండేలా సిద్ధం చేసుకున్నారు. ఆ సినిమా సక్సెస్ అయితే మంచి శుభశకునంలా ఉంటుంది. అందుకే అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. విజయ్ అంతా ప్రణాళిక ప్రకారం వెళ్తున్నారు..



కానీ తమిళనాడు రాజకీయాలకు సరిపోయే సమీకరణాలు మాత్రమే ఆయనకు వ్యతిరేకంగా ఉన్నాయి. పొత్తుల విషయంలో వ్యూహాత్మకంగా వ్యవహరించడంలో విఫలం కావడంతో..విజయ్ ప్రబావం ఎంత అన్నదానిపై ఇంకా సందేహాలు ఉన్నాయి. కానీ తాను జయలలిత, ఎంజీఆర్ లా సంచలనాలు సృష్టిస్తానని విజయ్ నమ్మకంతో ఉన్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com